ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 1 మే 2025 | 5

అమలాపురం
ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35(బుధవారం)
కనిష్ఠం : 28



స్వగ్రామం మాచవరంలో రోదిస్తున్న కుటుంబీకులు

పత్తి దుర్గాస్వామి(ఫైల్) ఈశ్వర శేషారావు(ఫైల్)

మేమెలా బతికేది..

దేవుడా!

సింహాచలం ఘటనలో ఇద్దరు కోనసీమ వాసుల మృతి

- రెండు కుటుంబాల్లో విషాదం
- కన్నీరుమున్నీరైన కుటుంబీకులు
- మాచవరంలో విషాదఛాయలు
- అండగా జనసేన : పవన్

అంబాజీపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎంత పనిచేశావ్ దేవుడా.. నిన్నుచూద్దామని వస్తే..నీ దగ్గరకే తీసుకుపోయావా..ఎలా బతికేది అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. నాన్నా లేవరా ఇంటికెళ్లిపోదాం.. తమ్ముడూ లేవరా అంటూ ఇద్దరి మృతదేహాలను పట్టుకుని విశాఖ కేజీహెచ్ వద్ద రోదిస్తున్న తీరు చూపరులను కంటతడిపెట్టించింది.. విశాఖ కేజీహెచ్ ప్రాంగణం బంధువుల రోదనలతో నిండిపోయింది. విశాఖ జిల్లా సింహాచలం సింహాద్రి అప్పన్న ఆలయం వద్ద గోడకూలిన దుర్ఘటనలో ఎనిమిది మంది మృతిచెందగా.. ఇద్దరు కోనసీమ జిల్లాకు చెందిన వారు ఉన్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన పత్తి దత్తుడు- వెంకటరమణ దంపతుల రెండో కుమారుడు పత్తి దుర్గాస్వామినాయుడు(28) వైజాగ్‌లో డైమండ్ ఇంటీరియర్స్ వర్క్ చేస్తున్నాడు.అదే గ్రామానికి చెందిన కుంపట్ల శ్రీనివాసరావు-సీతామహాలక్ష్మి దంపతుల ప్రథమ కుమారుడు మణికంఠ ఈశ్వరశేషారావు(శివ)(29) వైజాగ్‌లోని మెట్రో కంపెనీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరిద్దరిదీ ఒకే ఊరు.. స్నేహితులు కావడంతో ఎక్కడకు వెళ్లినా ఇద్దరూ కలిసే వెళతారు. మంగళవారం మధ్యాహ్నం ఇద్దరూ కలిసి అప్పన్న చందనోత్సవానికి వెళ్లారు.సింహాచలం ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తూ ప్రహరీ కూలిన ఘటనలో ఈ ఇద్దరూ మృతిచెందారు. ఈ వార్త టీవీలోను, సామాజిక మధ్యమాల్లోను రావడంతో కుటుంబీకులు చూసి షాక్‌కు గురయ్యారు.చేతికంది వచ్చిన కొడుకుల మృతివార్త తెలుసుకుని విషాదంలో మునిగిపోయారు. వెంటనే సింహాచలం బయలుదేరి వెళ్లారు. అనుకోని ఘటనతో ఇద్దరు యువకులు మృత్యువాత పడడంతో ఆ రెండు కుటుంబాలు కన్నీటిపర్యంతమయ్యారు.అందివచ్చిన కొడుకులు ఇకలేరని.. తిరిగిరారని తలచుకుంటూ రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. మృతులకు కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. బాధిత కుటుంబీకులను మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు,గణబాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శించారు. ఓదార్చారు.

జనసైనికుల మృతి బాధాకరం

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

జనసైనికులు పత్తి దుర్గాస్వామినాయుడు, కుంపట్ల మణికంఠ ఈశ్వరశేషారావు మృతి బాధాకరమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని,జనసేన పార్టీ తరఫున ఎంతో అభిమానంగా పనిచేశారన్నారు. మృతుల కుటుంబాలకు జనసేన అండగా నిలుస్తుందన్నారు.

దైవ భక్తే..దూరం చేసింది..



'నా బిడ్డకు దైవభక్తి ఎక్కువ. తరచూ ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుం టుంటాడు. వాడపల్లి వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు ప్రతి వారం వచ్చేవాడు.. అంబాజీపేట వచ్చి అందరినీ పలకరించి వెళ్లేవాడు.. ఇప్పుడు ఆ భక్తే అతడిని మా నుంచి దూరం చేసింది' ఇంటీరియర్ డెకరేషన్‌లో ఎంతో పేరు తెచ్చుకున్నాడు. మా కుటుంబా నికి చేదోడు..వాదోడుగా ఉంటున్నాడు అంటూ పత్తి దుర్గా స్వామినాయుడు తండ్రి వీర వెంకట సత్యనారాయణ విలపించారు.

పత్తి వీర వెంకట సత్యనారాయణ (దుర్గాస్వామినాయుడు తండ్రి)

ఎలా వెళ్లిపోయావురా




మమ్మల్ని విడిచి ఎలా వెళ్లిపోయావు రా తమ్ముడు.నువ్వు ఇక లేడంటే అమ్మ, నాన్న నమ్మడం లేదు..ఏం చేయమంటావు రా అంటూ శేషారావు సోదరుడు లక్ష్మీనారాయణ కన్నీటి పర్యంతమయ్యాడు. కుటుంబమంటే తమ్ముడికి ఎంతో ఇష్టం..ఏడాదికాలంగా వైజాగ్ మెట్రో కంపెనీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆస రాగా ఉంటున్నాడు. నాన్నకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. వాడే మా కుటుంబానికి అండ..

- శేషారావు సోదరుడు లక్ష్మీనారాయణ



నాయకుడే కార్మికుడై..!

నాయకుడే శ్రామికుడై అన్నట్టుగా.. మంత్రి సుభాష్ రామచంద్రపురంలో జరిగిన మేడే ముందస్తు వేడుకల్లో ఇలా ఖాకీ దుస్తులు ధరించి.. ఎర్ర తువాలు మెడలో వేసుకుని ఆటోడ్రైవర్లతో కలిసి ప్రదర్శన నిర్వహించి ఆకట్టుకున్నారు..



మంత్రి దుర్గేష్‌కు పీఎంవో కార్యాలయ ఆదేశాలు ప్రతులు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

మంత్రి దుర్గేష్‌కు సీఎం అభినందన

నిడదవోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) :వియత్నాంలో జరిగే బుద్ధ భగవానుడి అవశేషాల ప్రదర్శన కార్యక్రమ నిర్వ హణ బాధ్యతను కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజ్జూ,రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్‌లకు అప్పగిస్తూ పీఎంవో కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం సీఎం నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో మంత్రి దుర్గేష్‌ను అభినందించారు. వియత్నాంలో జరిగే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి దేశానికి,రాష్ట్రానికి పేరు తీసుకురావా లంటూ సూచించారని మంత్రి కందుల దుర్గేష్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఈ మేరకు రాజమహేంద్ర వరంలోని మధురపూడి ఎయిర్‌పోర్టు నుంచి బుధ వారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.అక్కడ నుంచి వియత్నాం వెళ్లనున్నారు. గురువారం నుంచి మే 6వ తేదీ వరకు జరిగే బుద్ధ భగవానుడి అవశేష ప్రదర్శన కార్యక్రమ నిర్వహణ చేయనున్నారు. మంత్రి దుర్గేష్ కు మధురపూడి విమానాశ్రయంలో జనసైనికులు ఘనంగా వీడ్కోలు పలికారు.



నేడు సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న కల్వచర్ల ఏపీఐఐసీ భూములు

ఆరు!

సీఎం చంద్రబాబు కలలకు రూపం వచ్చింది.. ప్రతి అసెంబ్లీలో ఒక పారిశ్రామికవాడ ఉండాలన్న ఆయన ఆలోచలకు నేడు తొలి బీజం పడనుంది..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల్లో పిఠాపురం,జగ్గంపేట, రామచంద్రపురం, రాజమహేంద్రవరంరూరల్, కాకినాడరూరల్, పెద్దాపురంతొలి విడతగా పారిశ్రామిక పార్కులను తీర్చిదిద్దను న్నారు..ఈ మేరకు గురువారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు..



ఏపీఐఐసీ కార్యాలయం

ఆరు నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు

- ఉమ్మడి జిల్లాలో మరో అడుగు
- తొలి విడతగా ఆరు చోట్ల నిర్మాణం
- భూములకు ఏపీఐఐసీ ఆపసోపాలు
- అరకొరగా ప్రభుత్వ భూములు
- అయినా వీటివైపే మొగ్గు
- నేడు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పరుగులు తీయించడం కోసం ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాలకు భూముల లభ్యత తలనొప్పిగా మారింది. ఒక్కో నియోజకవర్గంలో వందెకరాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రయత్నిస్తుంటే ఎక్కడా ఏపీఐఐసీకి భూములే దొరకడం లేదు. రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు పంపినా ఎక్కడా జాగా కనిపించడం లేదు. దీంతో అరకొరగానే ఉన్న స్థలాల్లో ఏదోలా పరిశ్రమలను ప్రోత్సహించడానికి నానాతంటాలు పడుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆశించిన స్థాయిలో భూమిలేని పరిస్థితి. ఉన్నంత వరకు భూములు చేతికి వచ్చిన ఆరు నియోజకవర్గాల్లో తొలి విడత పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు నిర్ణయిం చింది. సీఎం చంద్రబాబు నేడు(గురువారం) వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఐదు నియోజకవర్గాల్లో ప్రభుత్వం ప్లగ్‌అండ్‌ప్లే విధానంలో రూ.9.20 కోట్లతో భవనాలు నిర్మించి చిన్న కంపెనీలకు అద్దెకు ఇవ్వనుంది.

చంద్రన్న ఆదేశంతో కదలిక..

రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక రంగం పూర్తిగా పడకేసింది. అప్పటి అధికార నేతల బెదిరింపులు, భూదాహంతో ఉన్న కంపెనీలు, రావాల్సిన కంపెనీలు రాకుండా పోయాయి. దీంతో యువతకు ఉద్యోగాలు లభించని పరిస్థితి. ఇదిలా ఉండగా ప్రభుత్వం మారాక సీఎం చంద్రబాబు పారిశ్రామిక రంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గాల్లో సైతం చిన్నమధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలని నిర్ణయించారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భూముల లభ్యత బట్టి పది ఎకరాల నుంచి వంద ఎకరాల వరకు సిద్ధం చేయాలని ఏపీఐఐసీని ఆదేశించారు. వీటిలో ప్రభుత్వం ప్లాట్లు వేసి కంపెనీలకు కేటాయించడం, మరికొన్నింటిలో ప్రభుత్వమే భవనాలు నిర్మించి కంపెనీలకు ఇవ్వాలని నిర్ణయించారు.

ఆరు నెలలుగా భూజల్లెడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏపీఐఐసీ అధికా రులు గడచిన ఆరునెలలుగా నియోజకవర్గాల్లో భూములను గుర్తించే పనిలో పడ్డారు. రెవెన్యూ అధికారులను సంప్రదించి ప్రభుత్వ భూములు ఇవ్వాలని కోరారు. కానీ ఎక్కడ చూసినా పెద్దగా ప్రభుత్వ భూములు లేని పరిస్థితి.అక్కడక్కడా ఉన్నా ఎకరం,రెండెకరాలకు మించి లేవు. దీంతో ఏంచేయాలో ఏపీఐఐసీకి తోచని పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ ప్రభుత్వ భూముల కబ్జా, కొన్ని చోట్ల పూర్తిగా జగనన్న కాలనీలకు లాగేసుకోవడంతో ఎక్కడా భూములు లేవు. దీంతో ఏం చేయాలో తెలియక ఉన్న అరకొర భూములనే ఇవ్వాలని ఏపీఐఐసీ రెవె న్యూ అధికారులను కోరింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మొత్తం పారిశ్రామిక పార్కులకు 404 ఎకరాలే ఉన్నట్టు తేలింది. దీంతో ఏపీఐఐసీ తలపట్టుకుంటోంది. ఇంత తక్కువ భూమిలో పారిశ్రామికపార్కుల ఏర్పాటు ఎలాగో అర్థంకాక గింజుకుంటోంది. పోనీ ప్రైవేటుగా సేకరించాలంటే వందల కోట్ల లో ఖర్చు కానుంది. దీంతో పారిశ్రామిక పార్కు ల ఏర్పాటు కష్టతరంగా మారిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది.

తొలుత ఆరుచోట్లే...

కావాల్సినంత భూముల లభ్యత లేకపోవడం, అరకొర ఉన్న చోట ఇప్పటికీ ఆ భూములను రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీకి అప్పగించకపోవడంతో ఏపీఐఐసీ చేతులెత్తేసింది. దీంతో మే 1న నేడు సీఎం చంద్రబాబు ద్వారా వర్చువల్‌గా వీటికి శంకుస్థాపన చేసే అవకాశం లేకపోవడంతో వాటిని పక్కన పడేసింది. ప్రస్తుతం చేతికి భూములు వచ్చిన పిఠాపురం, జగ్గంపేట, రామచంద్రపురం,పెద్దాపురం, కాకినాడరూరల్,రాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గాల్లోనే తొలి విడత కింద పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేయాలని ఏపీఐఐసీ నిర్ణయించింది.వీటిలో రూ.9.20కోట్లతో చిన్న, మధ్య తరహా కంపెనీలకు ప్రభుత్వమే కార్యాలయాలు నిర్మించి అద్దెకు కేటాయించనుంది. ప్లగ్ అండ్ ప్లే విధానంలో వీటిని అన్ని సౌకర్యాలతో ప్రభుత్వం నిర్మించి కంపెనీలకు కేటాయిస్తుంది. నేరుగా కంపెనీలు ఇందులో ఏ ఇబ్బంది లేకుండా కార్యకలాపాలు ప్రారంభించవచ్చు.ఈ మేరకు నిధులు విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ఏపీఐఐసీ నివేదిక పంపింది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో భూములేకపోవడంతో ఏపీఐఐసీకి కల్వచర్లలో సొంతంగా ఉన్న 104 ఎకరాల్లో ప్లాట్లను పరిశ్రమలకు కేటాయించేలా త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుంది. ఈ లేఅవుట్‌కు సీఎం చంద్రబాబు నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు.కాకినాడ రూరల్, పెద్దాపురంలోను భూముల్లేవు. ఉన్న కొద్దిపాటి ఏపీఐఐసీ భూముల్లో సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు.వీటికి కూడా సీఎం నేడు శంకుస్థాపన చేయనున్నారు. ఏపీఐఐసీ భూములు మినహాయిస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కేవలం పిఠాపురం, జగ్గంపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోనే సీఎం ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు వర్చువల్ శంకుస్థాపన చేయనున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూముల లభ్యత అసలు లేకపోవడం, ఉన్న అరకొర విస్తీర్ణం ఎప్పటికి రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీకి అప్పగిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

పరిశ్రమలు ఇక్కడే..

- కాకినాడ జిల్లా పిఠాపురంలో 4.05 ఎకరాలు,కాకినాడరూరల్ వాకలపూడిలో ఏపీఐఐసీకి ఉన్న 2.99 ఎకరాలు, పెద్దాపురంలో 27 ఎకరాలను సిద్ధం చేస్తున్నారు. జగ్గంపేటలో 1.81 ఎకరాలు మాత్రమే గుర్తించారు. గండేపల్లిలో 3.39 ఎకరాలు, ప్రత్తిపాడు మండలం శంఖవరంలో 2.82 ఎకరాలు, తుని హంసవరంలో ఏడెకరాలు ప్రభుత్వ భూములు ఉన్నట్టు అధికా రులు తేల్చారు. కాకినాడ జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు 700 ఎకరాలు కాకపోయినా 400 ఎకరాలైనా ఉంటే చాలని అధికారులు భావిస్తే 49.06 ఎకరాలు గుర్తించారు.
- తూర్పుగోదావరి జిల్లాలో అనపర్తి నియోజకవర్గం రంగంపేటలో 8.90 ఎకరాలు గుర్తించారు.రాజమహేంద్రవరంలో సెంటూ కూడా లేదు.రాజానగరంలోని కోరుకొండలో 12.50 ఎకరాలు , రాజమహేంద్రవరం రూరల్ నిడిగట్లలో 12.50 ఎకరాలు ఉన్నట్టు గుర్తించారు. ఒక్క కొవ్వూరులోని తాళ్లపూడిలో 271 ఎకరాలు ఉన్నాయి. నిడదవోలులో సెంటు కూడా దొరకలేదు. గోపాలపురంలో 13.22 ఎకరాలు గుర్తించారు. తూర్పుగోదావరి జిల్లాలో 318 ఎకరాలు ఉన్నట్టు తేలింది.ఇందులో 80 శాతం భూములు కొవ్వూరులోనే ఉన్నాయి.
- కోనసీమ జిల్లాలో ముమ్మిడివరం, రాజోలు, గన్నవరం నియోజకవర్గాల్లో సెంటూ కూడా దొరకలేదు. రామచంద్రపు రంలోని ద్రాక్షారామలో 3.99 ఎకరాలు,అమ లాపురంలోని ఉప్పలగు ప్తంలో 6.83 ఎకరాలు, మండపేటలోని కేశ వరంలో 24.84 ఎకరాలు, కొత్తపేటలో 1.16 ఎక రాలు ఉన్నట్టు రెవెన్యూ అధికారులు ఏపీ ఐఐసీకి నివేదిక పంపారు. కోనసీమ జిల్లాలో మొత్తం 36.82ఎకరాలు ఉన్నట్టు తేల్చారు.

ప్రజల జీవనశైలిలో మార్పులు తీసుకురావాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు పరిపూర్ణ అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సంబంధితశాఖల ఆదేశించారు. పారిశుధ్యం, పరిశుభ్రతపట్ల అవగాహన కల్పించడం ద్వారా ప్రజల జీవనశైలిలో మార్పులు తీసుకువచ్చి గ్రామాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాస్థాయిలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలతో సమావేశం నిర్వహించారు. తొలుత స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరు, ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ నివేదికలపై చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి పారిశుధ్య సమస్యలను పరిష్కరిస్తూ ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలన్నారు. ప్రతినెలా 3వ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా భాగస్వాములు కావాలన్నారు. ఎక్కడా చెత్త లేకుండా పూర్తిస్థాయిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి తడిచెత్తను ఎరువుగాను, పొడిచెత్త, ప్లాస్టిక్‌ను విభజించి డిస్పోజల్ చేయాలన్నారు. కాల్వలు, డ్రైనేజీలు, రహదారుల చెంత చెత్త వేయకుండా చర్యలుతీసుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిరోధానికి చర్యలు చేపట్టి వాటి స్థానంలో ప్రత్యామ్నాయ జ్యూట్ బ్యాగులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ప్రభావవంతమైన పారిశుధ్య వ్యవస్థలు, పరిశుభ్రత పద్ధతులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్నారు. డీపీవో డి.శాంతలక్ష్మి కమిషనర్లు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన

రావులపాలెం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రైతులు దాళ్వా మాసూళ్ల చేసుకుంటూ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో తలమునకలవుతున్న తరుణంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని అకాలవర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రావులపాలెం మండలంలో దాళ్వా వరిచేలు కోత దశకు చేరుకోవడంతో రైతులు మాసూళ్ల పనుల్లో ఉన్నారు. మంగళవారం రాత్రి రెండుగంటలపాటు ఈదరుగాలులతో కూడిన వర్షం కురవడంతో కొన్ని ప్రాంతాల్లో ధాన్యపు రాశులు తడిచాయి. వాటిని బుధవారం ఉదయం నుంచి రైతులు ఆరబెట్టుకుని ఒబ్బిడి చేసుకున్నారు. రాత్రి ఆకాశం మేఘావృతమై ఈదరుగాలులు వీస్తుండడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు.



రావులపాలెం మండలంలో కళ్లాల్లో ఉన్న ధాన్యపు రాశులు



కుండలేశ్వరం వియర్ వద్ద గుండం

వేలం వేస్తే..

భారీ ఆదాయం

- నామమాత్రపు రుసుముతో గుండం చెరువు కేటాయింపు
- బహిరంగ వేలం వేయాలంటున్న స్థానికులు

కాట్రేనికోన, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గుండం చేపలు.. కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన ప్రాంతంలో ఈ పేరు తెలియనివారుండరు. వేసవిలో ఈ గుండం చేపల కోసం జనం ఎగబడుతుంటారు. ఇంతకీ ఈ గుండంలో దొరికే చేపలకు ఎందుకంత డిమాండ్ అంటే.. ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే.

సహజంగా ఏర్పడిన చెరువు

కాట్రేనికోన మండలం కుండలేశ్వరంలో ఈ గుండం ఉంది. బొబ్బర్లంక, పల్లంకుర్రు ప్రధాన పంటకాల్వ పరిధిలోఉన్న ఈ గుండం 100 అడుగుల లోతు ఉంటుంది. కుండలేశ్వరంవద్ద ఉన్న వియర్ ద్వారా అయినాపురం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని పంట కాల్వలకు సాగునీరు విడుదల చేస్తుంటారు. నీటి ప్రవాహ ఒత్తిడికి ఇక్కడ లోతైన చెరువు ఏర్పడింది. దీన్నే గుండంగా పిలుస్తున్నారు. పంట కాల్వలకు నీటి విడుదల నిలిపివేసినా ఈ గుండంలో మాత్రం నీరు సమృద్ధిగా ఉంటుంది. ఈ గుండంలో దొరికే చేపలు 20 నుంచి 30 కిలోల బరువు ఉంటాయి. పండుగప్పలు, వాలుగలు, బొచ్చు, శీలావతి, గడ్డిచేపలు, పలు ఇతర రకాల చేపలకు ఈ గుండం ప్రసిద్ధి. పరిసరాల్లోని నాలుగు మండలాల మాంస ప్రియులు గుండం చేపల కోసం వస్తుంటారు.

తక్కువ రుసుముతో..

సుదీర్ఘకాలంగా ఈ గుండాన్ని నామమాత్రపు రుసుము వసూలు చేస్తూ ఒకరికే పరిమితం చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతేడాది కేవలం రూ.4వేలకు ఈ చెరువు అతడి పరం చేశారన్న విమర్శలున్నాయి. కానీ ఇక్కడ సరుకు మాత్రం పెద్దమొత్తంలో ఆదాయం తెచ్చిపెడుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నీటిపారుదలశాఖ ఈ గుండాన్ని చేపలు పట్టుకునేందుకు బహిరంగవేలం వేస్తే పెద్దమొత్తంలో ఆదాయం వస్తుందని పలువురు సూచిస్తున్నారు.ఈవిషయంలో జాప్యం చేస్తూ అధికారులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

కొలిక్కిరాని కోతలు



పొలాల చెంతనే పంటకాల్వ పూడికతీత పనుల్లో ఉపాధి కూలీలు

- ఉపాధి పనుల్లో కూలీలు నిమగ్నం
- కూలీల కొరతతో రైతుల ఆందోళన
- ఓ పక్క ముమ్మరంగా ఉపాధి పనులు
- భయపెడుతున్న వాతావరణం

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దాళ్వాకోతలు ఒక కొలిక్కిరాలేదు. యంత్రాలతో కోయించినా ధాన్యం ఆరబోతకు కూలీలు దొరక్క రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఇక వాతావరణం దినదిన గండంగా అన్నదాతను హడలెత్తిస్తోంది. ఇలాంటి పరిస్థితిలో ఉపాధి పనులు ముమ్మరంగా జరగడం రైతులకు మింగుడుపడడం లేదు. జిల్లా టార్గెట్ రోజుకు లక్ష పనిదినాలని అధికారులు చెప్తున్నారు. మండలాల టార్గెట్ చూస్తే రోజుకు 6 వేలమంది పనిచేయాలి. ఈ పరిస్థితుల్లో దాళ్వా పనులకు కూలీలు సుముఖంగా లేరు. పైరు మొత్తం యంత్రాలతో కోస్తే పశుగ్రాసం లభించదు. అందుకే ఎక్కువమంది రైతులు పశుపోషణకోసం కూలీలతోనే కోతలు జరిపిస్తారు. ఇప్పుడు ఉపాధి పనులు జరుగుతున్నందున కూలీలుఎవరూ వ్యవసాయం పనులకు రావడం లేదని రైతులువాపోతున్నారు. కాల్వలు మూసిన వెంటనే పంటకాల్వల బాగుజేత పనులు చేయిస్తున్నారు. వేసవి తర్వాత కాల్వలకు నీరిచ్చే ముందు పూడికతీతవల్ల ప్రయోజనమని రైతులు అంటున్నారు.

ఈ సమయంలో ఉపాధి పనులు ఆపాలి

జిల్లావ్యాప్తంగా ఎక్కువ విస్తీర్ణంలో రైతులు సార్వా పంటను కోల్పోయారు. పంట చేతికి వచ్చే వేళ కూలీల కొరతతో పైరును ఒడ్డుకు చేర్చుకోలేకపోతున్నారు. వ్యవసాయపనుల సమయంలో ఉపాధి పనులు నిలిపివేసేందుకు అధికారులు అంగీకరించారు. ఈ ఏడాది పరిస్థితిని గమనించి ఉపాధి పనులు తాత్కాలికంగా నిలిపివేస్తే రైతులు గట్టెక్కుతారు.

-అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, కోనసీమ రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి

రోజుకు లక్షమంది కూలీలు పనిచేయాలి

రోజుకు లక్షమంది పనిచేయాలన్నది లక్ష్యం. ప్రస్తుతం రోజుకు 60వేలమంది మాత్రమే పనిచేస్తున్నారు. ఏ గ్రామంలోనైనా ఉపాధి కూలీలు వ్యవసాయ పనులకు వెళ్తే మాకు ఇబ్బంది లేదు. అక్కడి క్షేత్ర సహాయకులతో మాట్లాడుకుని కూలీల అంగీకారం మేరకు రైతులు వారిని పనిలో పెట్టుకోవచ్చు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం రైతుల సంక్షేమం కోసమే అన్న అంశం అందరికీ తెలిసిందే.

-డ్వామా ఏపీడీ రాంబాబు


జిల్లా క్రీడా మైదానంలో స్విమ్మింగ్ చేస్తూ...


ఫుట్‌బాల్ ఆడుతూ...

పరీక్షలు ముగిశాయి. వేసవి సెలవులు ఇచ్చేశారు. ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీపట్టిన పిల్లలకు స్వాతంత్ర్యం లభించినట్లయింది. ఇప్పుడు పూర్తిగా ఇంటిపట్టునే ఉండడంతో వారు చేసే అల్లరి అంతాఇంతా కాదు. దీనికి పరిష్కారంగా చాలా మంది పెద్దలు సమ్మర్ క్యాంప్స్‌ను ఎంచుకుంటున్నారు.

ఒకే సమయంలో అటు ఆటలు, ఇటు విజ్ఞానాన్ని అందించే ఈ వేసవి శిబిరాలు ప్రస్తుతం పిల్లలను కూడావిపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఇంతకు ముందులా వీరు సెలవుల్లో అమ్మమ్మ, తాతయ్య ఊర్లకు వెళ్లకుండా సమ్మర్ క్యాంప్‌ల వైపు మొగ్గుచూపుతున్నారు.

ఆటాడుకుందాం... రా!

(కాకినాడ కార్పొరేషన్-ఆంధ్రజ్యోతి)

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏదైనా కళలోను, క్రీడలోనో ప్రావీణ్యత ఉండడం అనే విషయాన్ని చదువుతో పాటు మరో అదనపు అర్హతగా గుర్తిస్తున్నారు. కాబట్టి చదువు ఒక్కటే సరిపోదని భావించడమే దీనికి కారణంగా చెప్పుకోవచ్చు. అందుకే వేసవి సెలవులను వృథాగా పోనీయకుండా ఓ కొత్త కళను నేర్చుకునేందుకు లేదా ఓ కొత్త పనిలో ప్రావీణ్యం సంపాదించేందుకు అటు పెద్దలు, ఇటు పిల్లలు ఉత్సాహం చూపిస్తున్నారు.

పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి

తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బయటపడే ఆటలను ఎంపిక చేసుకోవడం ముఖ్యం. ఎందుకంటే ఆస్తమా లాంటి సమస్యలు ఉండే చిన్నారులు స్విమ్మింగ్ చేయడం మంచిది కాదు. ఒక్కో చిన్నారి దేహదారుఢ్యం ఒక్కోలా ఉంటుంది. కాబట్టి టెన్నిస్ లాంటి ఇండివిడ్యువల్ స్పోర్ట్స్ లేదా బాస్కెట్‌బాల్ లాంటి గ్రూప్ యాక్టివిటీస్‌లో చేర్పించడం ఉత్తమం.

పిల్లలు ప్రతి ఒక్కరిలోనూ సృజనాత్మకత దాగి ఉంటుంది. దాన్ని గుర్తించి వెలికితీయడమే సమ్మర్ క్యాంప్‌ల ముఖ్య ఉద్దేశ్యం. సరదా కోసం మాత్రమే కాకుండా పిల్లలు ఆడుతూ, పాడుతూ ఎన్నో కొత్త విషయాలను ఈ వేసవి శిబిరాల్లో నేర్చుకుంటారు. ఇక్కడ నేర్చుకున్నవి భవిష్యత్తులో ఉపయోగపడడమే కాకుండా చిన్నారుల్లో జ్ఞాపకశక్తిని మరింతగా మెరుగుపరుస్తుంది.

ఇలాంటి శిబిరాల ద్వారా కొన్ని స్వప్రయోజనాలున్నాయి. సెలవుల కారణంగా తమ స్నేహితులను మిస్సయ్యామనుకునే పిల్లలకు ఈ శిబిరాల్లో ఇతర పిల్లలతో కలవడం ద్వారా ఆ


బాస్కెట్‌బాల్ సాధన చేస్తూ...

ఫీలింగ్ దూరమవుతుంది. కొత్త స్నేహితులు ఏర్పడతారు. ఈ కేంద్రాల్లో ఉండే పలు రకాలైన క్రీడా పరికరాలతో పిల్లల ఆటపాటలకు ఏమాత్రం కొదువుండదు.

క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఏటా వేసవిలో ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహిస్తోంది. విద్యార్థులకు ఆయా క్రీడాంశాల్లో ఆసక్తి పెంపొందించడంతో పాటు వారు రాణించేలా నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇప్పి స్తోంది. అర్హత కలిగిన శిక్షకుల నుంచి ఇప్పటికే దరఖాస్తులు ఆహ్వానించి ఎంపిక చేసింది. కాకినాడ జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో శిక్షణ అందించేందుకు సమాయత్తమవుతోంది.

- పిల్లల మనోల్లాసానికి సమ్మర్ క్యాంప్స్
- మే 1 నుంచి 31 వరకు శిక్షణ
- కాకినాడ జిల్లావ్యాప్తంగా 24 క్రీడాంశాల్లో 50 శిబిరాలు
- 2,500 మంది చిన్నారులకు అవకాశం

ఈ ఏడాది కాకినాడ జిల్లాలో 24 క్రీడాంశాల్లో 50 కేంద్రాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఒక్కో క్యాంపులో 8 నుంచి 14 ఏళ్లలోపు గల 25 మంది బాలురు, 25 మంది బాలికలకు మాత్రమే శిక్షణ అందజేస్తారు. ఎంపిక చేసుకున్న క్రీడాంశంలో నెల పాటు ఉచిత శిక్షణ ఇస్తారు. బాక్సింగ్, బ్యాడ్మింటన్ వంటి ఇండోర్ క్రీడలతో పాటు హాకీ, క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి అవుట్‌డోర్ క్రీడల్లో సైతం తర్ఫీదు ఇవ్వనున్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తారు.


షటిల్ ప్రాక్టీస్...



జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు సంబంధించి కాకినాడ, తుని, సామర్లకోట స్టేడియాల్లో నెల పాటు వివిధ క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ ఇస్తాము. క్రీడా శిబిరాలను, శిక్షకులను ఎంపిక చేశాము. బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలి.

బి.శ్రీనివాస్‌కుమార్
జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, కాకినాడ

లాల్ సలామ్
మేడే.. ఈనాడే



- తరాలు మారినా మారని కార్మికుల తలరాతలు
- దానికి తోడు వైసీపీ హయాంలో మొండిచెయ్యి
- పథకాలు, మండళ్లు రద్దు
- ప్రస్తుతం 'ఈ-శ్రమ్' ఒకటే దన్ను
- తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 6లక్షల మంది శ్రామికులు
- నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక లోకం లేకపోతే ప్రపంచంలో ఏ రంగమూ ముందుకు కదలదు. అయితే ఏళ్లకు ఏళ్లుగా వారి జీవితాల్లో మాత్రం వెలుగులు లేవు. తరాలు మారుతున్నా తలరాతలు మారట్లేదు. శ్రమనే నమ్ముకుని బతుకులను కష్టాలతో నెట్టుకొస్తున్నారు. పారిశుధ్యం, భవన నిర్మాణం, వ్యవ సాయం... ఇలా ఏ రంగంలోనూ కార్మికులు లేనిదే పని జరగదు. ఏదో ఒక రూపంలో కార్మిక శక్తి ఆయా రంగాల్లో చోదకశక్తిగా ఉంటోంది. కానీ వారి హక్కులు మాత్రం హననానికి గురవుతూనే ఉన్నాయి. ఒక ప్రభుత్వం మంచి చేయాలని సంకల్పిస్తే.. మరో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ దురుద్దేశాలతో ముందు పాలకుల పథకాలను నిర్దాక్షిణ్యంగా నిలిపివేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అదే జరిగింది. గత నాలుగేళ్లుగా కార్మికులకు మేలు జరగ్గపోగా అప్పటికే వారికి అందుతున్న సంక్షేమ పథకాలను నిలిపేసింది. కార్మిక చట్టాలు, కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం అమలు కోసం కార్మికులు యథావిధిగా ఎదురు చూస్తూనే ఉన్నారు. నేడు కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక లోకానికి లాల్ సలామ్ చెప్తూ.. ప్రత్యేక కథనం.

● రాష్ట్ర వేడుకలు రద్దు

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం వేడుకగా నిర్వహించేది. కార్మికులకు సత్కారాలు చేయడం, వారి సమస్యలపై దృష్టి పెట్టడం జరిగేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం వేడుకలను నిలిపివేసింది. ఎవరైనా స్వచ్ఛందంగా కార్యక్రమాలు చేసుకుని అధికారులను ఆహ్వానిస్తే హాజరయ్యే పరిస్థితిని తీసుకొచ్చింది. దీంతో నాలుగేళ్లుగా కార్మిక దినోత్సవాన్ని కూడా నిర్వహించట్లేదు.

● అన్నీ నిలిపివేత

టీడీపీ ప్రభుత్వంలో అప్పటిదాకా అమలుచేసిన సంక్షేమ పథకాలను సైతం వైసీపీ ప్రభుత్వం రద్దు చేసేసింది. కొన్నిటిని హోల్డులో పెట్టింది. భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంక్షేమ మండలిని కూడా నిర్వీర్యం చేసింది. అసంఘటిత రంగంలో.. బతుకులకు ఏ కష్టం వచ్చినా భరోసా లేని భవన నిర్మాణ తదితర కార్మికులకు పూర్తిగా అన్యాయం జరిగింది. మరణించిన కార్మికుని కుటుంబాన్ని ఆదుకునేవారే కరువయ్యారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో కార్మిక మండళ్ల ద్వారా కార్మికుల పిల్లల వివాహాలు, చదువులకు చేయూత అందించేవారు. సహజ మరణానికి రూ.2-3లక్షలు, అంగవైకల్యానికి గురైతే రూ.లక్ష, ప్రమాదశాత్తు మృతి చెందితే రూ.5లక్షలు బాధితుల కుటుంబాలను ఎంతో కొంత ఆదుకునేవి. గత వైసీపీ ప్రభుత్వంలో వాటిని క్రమేపీ రద్దు వరకూ తీసుకొచ్చారు. చివరకు మహిళా కార్మికులకు ప్రసూతి సహాయం కింద ఇచ్చే రూ.50 వేలనూ నిలిపివేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఈ-శ్రమ్ కార్డులు మాత్రమే వారికి ప్రభుత్వాల తరఫున ఉన్న దన్నుగా కనిపిస్తున్నాయి. ఇక సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోర్టులు ఆదేశిస్తున్నా అమలు జరగట్లేదు. కనీస వేతనాల పరిస్థితీ అంతే. గ్యాస్ డెలివరీ బాయ్స్, పెట్రోలు బంకుల్లో పనిచేసేవారు.. తదితర కొన్ని రంగాల్లోని కార్మికులకు కనీసం వేతనాల మాట అటుంచితే అసలు జీతాల చెల్లింపే ఉండదు. వారికి వినియోగదారులు దయతలచి ఇచ్చే డబ్బులే జీవనోపాధి అనే నిజం కలచివేస్తోంది. చిన్న పని దొరికితే ఆ రోజు గడుస్తుందనే పరిస్థితుల్లో ఉన్న ఎంతోమంది భవన నిర్మాణ రంగ కార్మికులను రోజూ నగరాలు, మండల కేంద్రాల్లోని ఆయా ప్రదేశాల్లో చూడవచ్చు. కాంట్రాక్టు సంస్థలు/వ్యక్తులు కార్మికుల చెమట కష్టంలో సైతం కమీషన్ తీసుకుంటూ దోపిడీకి పాల్పడుతూనే ఉన్నారు.

● జిల్లాలో 6లక్షల మంది

తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో సుమారు 4లక్షల మంది అసంఘటిత, దాదాపు 2లక్షల మంది సంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. కార్మిక శాఖ వారి సమస్యలకు చట్ట ప్రకారం పరిష్కారం చూపుతోంది. అసంఘటిత రంగ కార్మికుల్లో ఇప్పటికే 3.50 లక్షల మందికి ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. మిగతా వారికి పూర్తి చేయడానికి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తోంది.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

బీఎస్‌ఎం వలీ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, తూర్పు గోదావరి (ఇన్చార్జి అధికారి)

సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల వృత్తిపరమైన, ఇతర సమస్యలను తీర్చడానికి ఎప్పుడూ సిద్ధమే. కేసుల పెండింగుని 75 నుంచి 3కు తీసుకొచ్చాం. దీంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు గట్టిగా కృషి చేస్తున్నాం. గత ఏడాదిలో 28 కేసులు నమోదు చేశాం. అసంఘటిత రంగ కార్మికులు, ప్లాట్‌ఫాం వర్కర్లు (యాప్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ఆధారంగా పని చేసేవారు) వెంటనే ఈ-శ్రమ్ కార్డు పొందాలి.

వైద్య ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలో ఖాళీగా ఉన్న వైద్య ఉద్యోగాలభర్తీకి దరఖాస్తులు కోరుతున్నామని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కంప్యూటర్ ప్రోగ్రామర్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ ట్రైనర్ (పీఈటీ), ఎలక్ట్రికల్ హెల్పర్, మార్చురీ అటెండెంట్, ఆఫీస్ సబార్డినేట్, అనస్థీషియా టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2, నెట్‌వర్కు అడ్మినిస్ట్రేటర్, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, స్పీచ్ థెరపిస్ట్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, జనరల్ డ్యూటీ అటెండెంట్, స్టోర్ అటెండెంట్, సైకియాట్రిక్ సోషల్ వర్కర్, చైల్డ్ సైకాలజీ, క్లినికల్ సైకాలజిస్ట్, ల్యాబ్ అటెండెంట్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి చేసిన తమ దరఖాస్తులను మే 1వ తేదీ నుంచి 12వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు ప్రభుత్వ వైద్యకళాశాల కార్యాలయంలో అందజేయాలని ఆమె పేర్కొన్నారు.

నేడు మేడే ర్యాలీ, బహిరంగ సభ

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ రాక

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 1వ తేదీ గురువారం సీపీఐ, ఏఐటీయూసీ, రాజమండ్రి జట్టు లేబర్ యూనియన్, ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులతో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఉదయం 9 గంటలకు రాజమండ్రి జట్టు లేబర్ యూనియన్ కార్యాలయం నుంచి కార్మిక ప్రదర్శన ప్రారంభమవుతుందని, షెల్టన్ హోటల్ సమీపంలోని ఆవ వాటర్ ట్యాంకుల వద్ద బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పాల్గొంటారని, కార్మికులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాడపల్లి స్వామి, అమ్మవార్లకు నగలు బహూకరణ

● ఓ భక్తురాలి నిలువుదోపిడీ సమర్పణ

ఆత్రేయపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం విశాఖపట్టణానికి చెందిన శ్రీ వెంకటకృష్ణ అన్నమాచార్య సంస్థ అమ్మవారికి 46 గ్రాములతో రెండు మంగళసూత్రాలు, కేజీన్నర వెండి పళ్లెం స్వామివారికి సమర్పించారు. సంస్థ ప్రతినిధులకు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు.


స్వామి,అమ్మవార్లకు బంగారు సూత్రాలు, వెండికంచం బహూకరిస్తున్న దాతలు, నిలువుదోపిడీ సమర్పిస్తున్న భక్తురాలు

మొక్కు చెల్లించిన భక్తురాలు

కోరిన కోర్కెలు నెరవేరడంతో ఓ భక్తురాలు స్వామివారికి నిలువుదోపిడీ సమర్పించుకున్నారు. బుధవారం కుటుంబ సభ్యులతో ఆ భక్తురాలు స్వామివారిని దర్శించుకుని ఆమె ఒంటిమీద ఉన్న బంగారు వస్తువులను ముడుపు మూట కట్టి స్వామివారి హుండీలో సమర్పించుకున్నారు.

అఖిల భారత రోప్ స్కిప్పింగ్‌లో
'నన్నయ'కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల రోప్ స్కిప్పింగ్ పురుషుల విభాగంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. మహిళా విభాగంలో తృతీయ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలో క్రీడాకారులను వీసీ అభినందించి వివరాలు తెలిపారు. రాజస్థాన్‌లోని పింద్వారా మాధవ్ విశ్వవిద్యాలయంలో ఈనెల 22 నుంచి 24 వరకూ జరిగిన ఈ పోటీలలో నన్నయ అనుబంధ కళాశాల భీమవరంలోని డీఎస్‌ఆర్ కళాశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ దక్కించుకున్నారన్నారు. అఖిలభారత రోప్ స్కిప్పింగ్ పురుషుల విభాగంలో ఐదు పతకాలు, మహిళా విభాగంలో నాలుగు పతకాలు సాధించారన్నారు. చక్కని ప్రతిభకనబరచిన ఆర్.యేసు బంగారు వెండి పతకాలు, కె.వేణుసాయి రెండు వెండి పతకాలు, ఎం.లీలాగణేష్ ఒక వెండి పతకం సాధించారన్నారు. మహిళా విభాగంలో జె.గాయత్రి, ఎం.నాగదేవి, సీహెచ్ సాయిలలిత, ఎస్‌ఆర్ గంగాభవానీలు ఒక్కొక్క బంగారు పతకం సాధించారని తెలిపారు. క్రీడాకారులను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధికారులు పాల్గొన్నారు.

మే 3 వరకూ బీఈడీ పరీక్షలు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 3వరకూ జరుగుతాయని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయంలోని పరీక్షా కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈనెల 29 నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలకు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ప్రస్తుతం 169 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారన్నారు.



పరీక్షాకేంద్రాన్ని పరిశీలించిన వీసీ ప్రసన్నశ్రీ

కేంద్ర న్యాయశాఖ మంత్రితో ఎంపీ సతీష్ బాబు భేటీ

కాకినాడసిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర చట్ట, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌తో బుధవారం ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో చట్ట, న్యాయవ్యవస్థకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలపై ఎంపీ చర్చించారు. ముఖ్యంగా కర్నూల్‌లో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు, న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల సంఖ్య పెంపు, న్యాయమూర్తుల ఖాళీలభర్తీ, విపత్తు ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో న్యాయస్థానాలు నిర్మాణం వంటి అంశాలపై చర్చించినట్లు ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి విడుదలచేసిన ప్రకటనలో వెల్లడించా రు. అదేవిధంగా రాష్ట్ర పోలీస్‌శాఖ, న్యాయ వ్యవస్థ మధ్య సమన్వయం, కేసుల పరిష్కారంలో జాప్యం, కోర్టుల ఆధునీకరణ వంటి అంశాలను ఎంపీ సతీష్‌బాబు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.


కేంద్ర మంత్రి అర్జున్‌రామ్‌ను కలిసిన ఎంపీ సానా సతీష్‌బాబు

అక్షయ తృతీయ వేళ... బంగారు రంగులో భీమేశ్వరుడు


నూతన పట్టు వస్త్రంతో స్వామివారి అలంకరణ

సామర్లకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా కాకినాడజిల్లా సామర్లకోటలోని కుమార రామ భీమేశ్వర స్వామికి పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, అంజిబాబు, వెంకన్న అభిషేకాలు జరిపారు. బాలా త్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన చేశారు. స్వామిని బంగారు వర్ణంతో కూడిన పట్టు వస్త్రంతో సర్వాంగసు oదరంగా అలంకరించారు. ఈవో బళ్ల నీలకంఠం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డీఆర్‌యూసీసీ మెంబర్‌గా అనిల్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారులు కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా కాకినాడ రెల్లిపేటకు చెందిన ముత్యాల అనిల్ నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు సిఫార్సు మేరకు రైల్వేశాఖ అనిల్ నియామకాన్ని ధృవీకరిస్తూ నియామక పత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎంపీ క్యాంపు కార్యాలయంలో అనిల్‌ను బుధవారం మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని) సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మేకా లక్ష్మణమూర్తి, బండి నరేంద్ర, సాయిబాబా, బర్ల శ్రీనివాస్, జోగా రాజు, దుర్గాప్రసాద్, శ్రీమన్నారా యణ, రెల్లి సంఘం నాయకులు సత్యం, బంగారు సత్తిబాబు, సోమాదుల గోవిందు, బండి లక్ష్మీనారాయణ, శ్రీవడ్డి పోలమాంబ రెల్లికుల పంచాయతీ సంఘం పెద్దలు పాల్గొన్నారు.


అనిల్‌ను సత్కస్తున్న దృశ్యం

మెరుపులు, ఉరుములొస్తే
పిడుగులే



ప్రజలను అప్రమత్తం చేస్తూ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచనలు

సామర్లకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో నల్లని మబ్బులు, మెరుపులు, ఉరుములు కనబడితే పిడుగులు పడే అవకాశం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచిస్తోంది. అంతేకాదు ప్రతీ సెల్ ఫోన్‌కు పిడుగుల సమాచారాన్ని అందిస్తూ ప్రజలను కూడా అప్రమత్తం చేస్తున్నారు. పిడుగుపాటు సంకేతాలు, పిడుగులు పడే ప్రదేశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనుల వివరా లను ప్రజలకు వివరిస్తూ ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా ప్రజలను చైతన్యం చేస్తోంది. ప్రతీ ఏటా ఏప్రిల్ నెల నుంచి మే నెలాఖరు వరకూ సాయంత్రం పూట ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో పిడుగులు పడి మనుషులు, జంతువులకు ప్రాణనష్టం జరిగే అవకాశముంది. దీనిపై పలు సూచనలు, జాగ్రత్తలను వివరిస్తున్నారు.

చేయకూడనివి

- ఆరుబయట ప్రదేశాల్లో ఉండకూడదు.
- ఆశ్రయం కోసం చెట్ల కిందకు వెళ్లకూడదు.
- నీటిలో ఉండకూడదు, లోహపు పైపుల నుంచి వచ్చే నీటిని తాకకూడదు.
- సెల్‌ఫోన్ ఉపయోగించరాదు, రేకుల షెడ్ల కింద, వరండాలలో ఉండరాదు.
- ఉరుములు, మెరుపులు తదుపరి కనీసం 30 నిమిషాల వరకూ బయటకు వెళ్లరాదు.
- ఎలక్ట్రిక్ ఉపకరణాలు, వ్యవసాయ పంపుసెట్లు ఉపయోగించరాదు.
- ట్రాక్టర్లు, మోటారు సైకిళ్లను ఆరుబయట ఉంచరాదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



- టీవీ, రేడియోల ద్వారా వాతావరణ సమాచారాన్ని తెలుసుకుని స్థానిక హెచ్చరికలు పాటించాలి.
- బహిరంగ ప్రదేశాల్లో ఉన్నపుడు మోకాళ్ల మధ్య తల వంటి చేతులతో చెవులను మూసు కుని భూమికి తగలకుండా వంగి కూర్చోవాలి.
- గోడలు, ద్వారాలు, కిటికీలకు దూరంగా ఉండాలి.
- ఎండిన చెట్లు, విరిగిన కొమ్మలకు దూరంగా ఉండాలి. వాహనాల్లో ప్రయాణించే వారు వాటిని సురక్షిత ప్రాంతాల్లో నిలిపి అందులోనే కూర్చోవాలి.
- పశుసంపదను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.

పిడుగులు పడే ప్రదేశాలు

ఎత్తయిన ప్రదేశాలు, కొండప్రాంతాలు, పొడవైన చెట్లు, విద్యుత్, టెలీఫోన్ స్తంభాలు, టవర్‌లైన్లు, సెల్ ఫోన్ టవర్లు, విడివిడిగా ఉంటే ప్లాట్లు, ఇళ్లు, బహిరంగ ప్రదేశాల్లో పిడుగులు పడేందుకు ఆస్కారముంటుంది.

పిడుగుపాటుకు సంకేతాలు

ఆకాశంలో నల్లని మబ్బులు గుమికూడడం, మెరుపులు, ఉరుములు, వేగంగా గాలులు వీయడం వంటివి పిడుగుపాటుకు సంకేతాలుగా భావించాలి.



క్రికెట్ టోర్నీకి వెళ్లొస్తూ తిరిగిరాని లోకాలకు..

ద్విచక్రవాహనాన్ని ట్రాలీ ఆటో ఢీకొనడంతో ఇద్దరు మృతి

వీఆర్‌పురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ట్రాలీ ఆటో ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందిన ఘటన మండలంలోని శబరిరాయిగూడెం గ్రామ సమీపాన జరిగింది. వీఆర్‌పురం ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. రామవరం పంచాయతీలోని శబరిరాయిగూడెం గ్రామానికి చెందిన మడకం నరేష్ (34), కొప్పల్లి గ్రామానికి చెందిన కారం చంద్రయ్య (30) వీఆర్‌పురంలో మంగళవారం జరిగిన క్రికెట్ టోర్నీకి వెళ్లారు. అనంతరం రాత్రి పది గంటలకు ద్విచక్రవాహనంపై స్వగ్రామం వస్తున్న క్రమంలో శబరిరాయిగూడెం సమీపంలో రేఖపల్లి గ్రామానికి చెందిన ట్రాలీ ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. తీవ్ర గాయాలైనవారిని స్థానికులు చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నరేష్ మృతిచెందాడు. కారం చంద్రయ్యను భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 12గంటలకు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం మృతదేహాలను బంధువులకు అప్పగించామన్నారు.




నరేష్, చంద్రయ్య మృతదేహాలు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న వీఆర్‌పురం ఎస్ఐ సంతోష్‌కుమార్

పాముకాటుకు మహిళ మృతి

ఇంటి లోపల ఇరుక్కున్న సర్పాన్ని గునపాలతో హతమార్చిన స్థానికులు

అంతర్వేది, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామం బోను ప్రాంతం సమీపంలో మంగళవారం రాత్రి నాయుడు లక్ష్మిని పాము కాటు వేసింది. భయభ్రాంతులకు గురైన ఆమె కేకలు వేయగా స్థానికులు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఇంతలోనే ఆమె మరణించినట్టు వైద్యులు తెలిపారు. లక్ష్మి కుమారుడు అనారోగ్యంతో ఉండడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుడున్నాడు. సయయానికి కుమారుడు కూడా ఆసుపత్రిలో ఉండడంతో స్థానికులు తీసుకువెళ్లినా ప్రాణాలు దక్కలేదని బంధువులు తెలిపారు. బుధవారం ఉదయం లక్ష్మి ఇంట్లో స్థానికులు పొగ పెట్టి పాము కోసం వెతకగా పాము బయటకు వచ్చి మళ్లీ ఇంట్లోకి ప్రవేశించింది. స్థానికులు సాయంతో పామును వెతకసాగారు. మట్టి ఇంటిని తవ్వగా లోపల ఇరుక్కున్న పామును స్థానికులు గునపాలతో హతమార్చారు. రాజోలు ప్రభుత్వాసుపత్రిలో లక్ష్మి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



మరణించిన లక్ష్మి



స్థానికుల చేతిలో హతమైన పాము

సింహాచలం ఘటన బాధాకరం : యనమల

తుని రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహాచలం ఘటన బాధాకరమని, గోడకూలి భక్తులు మృతిచెందడం తనను కలిసి వేసిందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రకృతి వైపరీత్యం వల్ల జరిగిన ప్రమాదంలో బాధితులు పట్ల దేశమంతా సానుభూతి చూపిస్తుంటే మాజీ సీఎం జగన్‌మాత్రం శవ రాజకీయం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈదురుగాలులకు 21 విద్యుత్ స్తంభాలు నేలమట్టం

కిర్లంపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులు, భారీ వర్షానికి కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో సుమారు 20 విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. రామచంద్రపురం నుంచి కిర్లంపూడి మండలంలో సుమారు పది గ్రామాలకు విద్యుత్ సరఫరా వెళ్తుంది. దీంతో రామచంద్రపురం సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి కిర్లంపూడి ఎలక్ట్రికల్ ఎఈ, జగ్గంపేట ఎలక్ట్రికల్ డీఈ, అధికారులతో మాట్లాడి బుధవారం ఉదయం 20 కొత్త విద్యుత్ స్తంభాలు రామచంద్రపురం గ్రామానికి తెప్పించారు. దగ్గరుండి స్తంభాల పనులు చేయించారు.



కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు దృశ్యం

వివాహ శుభలేఖలు ఇచ్చి తిరిగి వెళ్తుండగా విషాదం

డివైడర్‌ను ఢీకొన్న స్కూటీ
రామచంద్రాపురానికి చెందిన ఒకరి మృతి, మరొకరికి గాయాలు



ప్రమాద స్థలంలో వెంకటేష్ మృతదేహం

ఎలమంచిలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కుమార్తె వివాహ శుభలేఖలు బంధువులకు ఇచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఎలమంచిలి మండలం మర్రిబంద జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలివి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం రైస్‌పేటకు చెందిన నక్కా వెంకటేష్ (35), అనుపోజు బాబీ బావ బావమరుదులు. బాబీ కుమార్తెకు వచ్చే నెలలో వివాహం నిశ్చయం కావడంతో శుభలేఖలు విశాఖలోని బంధువులకు వచ్చి తిరిగి రామచంద్రాపురం స్కూటీపై వెళ్తుండగా మర్రిబంద సమీపంలో ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే హైవే పెట్రోలింగ్ పోలీసులు, ఎన్‌హెచ్-5 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే వెంకటేష్ మృతి చెందినట్టు గుర్తించారు. తీవ్రగాయాలైన బాబీని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు వెంకటేష్ బంగారం పని చేస్తుంటాడని, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని ఎలమంచిలి ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాబీని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

వయసు 20.. దొంగతనాలు 35

● తప్పించుకుని తిరుగుతూ పట్టుపడిన దొంగ ● ఐదు బైక్‌లు స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 20 ఏళ్ల వయస్సులో 35 దొంగతనాలు చేసి తప్పించుకుని తిరుగుతున్న దొంగను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీసులు పట్టేశారు. విశాఖపట్నం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు ఇళ్ల దొంగతనాలు, బైక్ దొంగతనాల్లో ఆరితేరిన దొంగను పట్టేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డేగాపురానికి చెందిన జువ్వల కుమార్ రాజా అలియాస్ తరుణ్‌కుమార్, బేతా దుర్గాప్రసాద్, మామిడి దుర్గారావు ముగ్గురు కలిసి 2023లో విశాఖజిల్లా గోపాలపట్నంలో ఒక ఇంటి తాళాన్ని పగులగొట్టి దొంగతనం చేశారు అటుపై భీమవరం చిన్నఅమిరంలో బైక్, ఎన్టీఆర్ జిల్లా పటమటలో బైక్, రాజమహేంద్రవరం టూటౌన్‌లో రెండు బైక్‌లు, వీరపల్లిలో బైక్, ఉండిలో బైక్, బొమ్మూరు పరిధిలో బైక్‌ను తరుణ్, మారుబోయిన మావుళ్లు అనే దొంగతో కలిసి అపహరించుకుపోయారు. ఇందులో మావుళ్లను గత నెల 23న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని టూటౌన్ పోలీసులు తెలిపారు. అయితే బుధవారం టూటౌన్ సీఐ పి.శివ గణేష్ ఆధ్వర్యంలో క్రైమ్ పార్టీ ప్రత్యేక నిఘాపెట్టి ఐదు బళ్ల మార్కెట్ సమీపంలో రైల్వే క్వార్టర్స్ వద్ద తరుణ్‌కుమార్‌ను పట్టుకున్నారు. నిందితుడి నుంచి ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. తరుణ్‌ను చాకచక్యంగా పట్టుకున్న సీఐ శివ గణేష్, హెచ్‌సీ ఎస్.రాజశేఖర్, క్రైమ్ కానిస్టేబుల్ ఎస్కే రబ్బాని, కానిస్టేబుల్స్‌ను తూర్పుగోదావరి ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.



నిందితుడు, బైక్‌లతో పోలీసులు

ఆర్యవటంలో సింహాద్రి అప్పన్న చందనోత్సవం



చందన రూపుడై దర్శనమిస్తున్న స్వామివారు



చందనాన్ని నూరుతున్న దృశ్యం

కాజులూరు (కరప), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఆర్యవటం శివారు చందాలవారిపేటలో బుధవారం శ్రీవరాహలక్ష్మీనరసింహ స్వామి (సింహాద్రి అప్పన్న) చందనోత్సవం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి సంకల్పం, విశ్వక్సేనారాధన, చందనం తొలగించుట, పంచామృతస్నపనం, అర్చన, బాలభోగ నివేదన, మం గళహారతి క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి నిజరూప దర్శనం కల్పించగా అధిక సంఖ్యలో భక్తులు తిలకించి తరించారు. సాయంత్రం నాలుగు గంటలకు చందన సమర్పణ చేసి స్వామివారి తిరు కల్యాణోత్సవం, పూర్ణాహుతి జరిపారు. అనంతరం నిర్వాహక కమిటీ సభ్యులు భక్తులకు తాగునీరు, అల్పాహారం, అన్నసమారాధన నిర్వహించారు.

రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు



కాకినాడలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వీర్రాజు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.15 వేలు కోట్ల ఆర్థిక గ్రాంట్ కూడా మంజూరు చేసిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. కాకినాడలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విడిపోయిన ఏపీకి అత్యాధునికమైన రాజధాని నిర్మాణం చేసేందుకు గతంలో కేంద్ర ప్రభుత్వం రూ.18వేల కోట్ల నిధులు ఇచ్చిందని, ప్రస్తుతం రూ.15వేల కోట్ల ఆర్థిక గ్రాంట్ మంజూరు చేసిందన్నారు. ప్రధాని మోదీ మే 2న రాష్ట్రానికి వస్తున్నారని, కూటమి ప్రభుత్వంలో ఏపీ ముందుకు వెళ్తుందన్నారు. రాష్ట్రంలో 11 నదుల ద్వారా రూ.50వేల కోట్లతో ఇంటింటికి మంచినీటి కుళాయి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన చెప్పారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వర రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి గల్లంతు



వంతెనపై వదిలిపెట్టిన దుస్తులు

కొవ్వూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరి దూకి వ్యక్తి గల్లంతయ్యాడు. బుధవారం వంతెన 159వ స్తంభం వద్ద చొక్కా, లుంగీ వదిలిపెట్టి వ్యక్తి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులకు పోలీసులకు సమాచారం అందించారు. దుస్తుల ఆధారంగా కొవ్వూరు పట్టణానికి చెందిన కోట్ల సత్యనారాయణ (78)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అర్ధరాత్రి వరకు గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయవలసి ఉంది.

ఇంట్లోకి ప్రవేశించి మహిళలు, పిల్లలపై దాడి

ముగ్గురు యువకులపై కేసు

కరప, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి మహిళలు, పిల్లలపై దాడి చేసిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్టకు చెందిన మోకన బన్నీ, బోడా సతీష్, గుడుగుడు కాశీ గత నెల 27న రాత్రి అదే గ్రామానికి చెందిన మడిపల్లి రాజు ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించారు. తమ మోటారు సైకిల్‌ను వారింట్లో దాచిపెట్టారనే ఉద్దేశంతో రాజు భార్య సత్య, వారి పిల్లలపై దాడి చేశారు. అడ్డుకోబోయిన రాజు మేనకోడలు గుబ్బల రోజారాణి, ఆమె తల్లిపై కూడా దాడి చేశారు. దీనిపై రోజారాణి బుధవారం కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సునీత పేర్కొన్నారు.

జాతీయస్థాయి ఎన్ఎస్ఎస్ సదస్సులో శ్యామ్‌కుమార్


జేఎన్టీయూకే, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్‌లో ఎన్ఎస్ఎస్ పాత్రపై గతనెల 25, 26తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి ఎన్ఎస్ఎస్ సదస్సులో కాకినాడ జేఎన్టీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ గుబిలి శ్యామ్‌కుమార్ ఏపీ నుంచి హాజరైనట్టు పీఆర్వో రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వీసీ ఛాంబరులో ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ శ్యామ్‌కుమార్‌ను అభినందించారు. తనకు ఈ అవకాశం కల్పించిన హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్‌కు, ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్‌కు శ్యామ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

రెడ్‌క్రాస్ జాతీయ కార్యవర్గ సమావేశానికి రామారావు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖకు చైర్మన్‌గా ఎన్నికై జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన వైడి రామారావు తన మొదటి సమావేశానికి హాజరుకావడానికి ఢిల్లీ వెళ్లారు. ఈ నెల 2న రెడ్‌క్రాస్ జాతీయ చైర్మన్ కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జేపి నడ్డా అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు.

అక్రమంగా చెట్లు నరికి తరలింపు

సామర్లకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోదావరి కాలువ లాకుల వద్ద రోడ్డుకిరువైపులా కాలువ గట్టు వద్ద ఉన్న భారీ చెట్లను గత రెండు రోజులుగా నిబంధనలకు విరుద్ధంగా నరికివేయించి అక్రమ అక్రమాలు చేశారని పలువురు రైతులు ఆరోపించారు. ఇరిగేషన్ అధికారులు గత ఏడిది వేసవి సీజన్లో సామర్లకోట బీటీయూటీ నుంచి ముత్యాలమ్మ విగ్రహం వకూ కాలువ గట్టుపై ఉన్న పలు చెట్లను నరికి విక్రయించడంతో అప్పట్లో రైతులు సైతం ఫిర్యాదులు చేశారు. అదే రీతిలో ఈ ఏడాది కూడా భారీ చెట్లను నరికించేందుకు అటవీ శాఖ అధికారుల అనుమతులు పొందకుండానే అధునాతన యంత్రపరికరాలతో భారీ చెట్లను నరికివేశారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని సామర్లకోట తహశీల్దార్ చంద్రశేఖర రెడ్డికి బుధవారం రాత్రి రైతులు ఫిర్యాదు చేశారు.



మోతుగూడెంలో బుధవారం ఉదయం సీలేరు నదిపై సూర్యోదయ సమయంలో కనువిందు చేసిన దృశ్యం (మోతుగూడెం, ఆంధ్రజ్యోతి)

వాటే సీన్‌లేరు

అదిరే అరటిచెట్టు

కోనసీమ జిల్లా మలికిపురం మండలం గొల్లపాలెంలో మట్టా శ్రీనివాసరావు అనే రైతు పెరటిలో వేసిన అరటి చెట్టు వృక్షంలా ఎదిగింది. 24 అడుగుల ఎత్తుకు ఎదిగి ఆశ్చర్య పరుస్తుంది. సాధారణంగా అరటిచెట్టు 15 అడుగులు మించి ఎత్తు పెరగవు. ఈ అరటి విత్తనం పేరు బూడిద పక్కీస్ రకమని, విజయనగరంలోని స్నేహితుని ఇంటి నుంచి తీసుకువచ్చినట్టు శ్రీనివాసరావు తెలిపారు.

మలికిపురం (ఆంధ్రజ్యోతి)





అన్నసమారాధన

మలికిపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మలికిపురంలో వేంచేసి ఉన్న ముత్యాలమ్మవారి తీర్థ మహోత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం అన్నసమారాధ నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ, అన్నప్రసాదాలు స్వీకరించారు.

వెంకట్‌కు సాహితీ సంబరాలకు ఆహ్వానం

అంబాజీపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఏలూరులో మే10,11 తేదీల్లో జరిగే శ్రీశ్రీకళావేదిక 148వ ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు అంబాజీపేటకు చెందిన సహజ కవి పొలమూరి వెంకట్‌కు ఆహ్వానం అందింది. కళావేదిక సంస్థ సీఈవో కత్తిమండ ప్రతాప్, కొల్లి రమావతి, జి.ఈశ్వరి, భూషణం, పార్థసారధిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మే 2న అమరావతి పనుల పునః ప్రారంభానికి రానున్న ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. నియోజకవర్గం నుంచి కూటమి తరపున పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లేలా ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అమలాపురం టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మండలాలు, పట్టణ స్థాయిలో పార్టీ శ్రేణులను తరలించేందుకు కూటమి నేతల ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు నియోజకవర్గ అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. పట్టణంలో ఏడు బ్రిడ్జిలు నిర్మాణం చేయనున్నట్టు వెల్లడించారు. పట్టణ పరిసర గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా స్థల సేకరణ చేయనున్నట్టు వెల్లడించారు. సమావేశంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కూటమి నాయకులు పెచ్చెట్టి విజయలక్ష్మి, నల్లా పవన్‌కుమార్, ఆర్డీఎస్ ప్రసాద్, తిక్కిరెడ్డి నేతాజీ, కర్రి దత్తుడు, బొర్రా ఈశ్వరరావు, మట్టా మహలక్ష్మిప్రభాకర్, అధికారి జయవెంకటలక్ష్మి, ఆశెట్టి ఆదిబాబు, మాకిరెడ్డి పూర్ణిమ, మాడా మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి

అమలాపురంలో నిరసన



అమలాపురంలో ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని కొవ్వొత్తులతో చేపట్టిన నిరసనలో జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ తదితరులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ రాక్స్, మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకట్రావు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలిపారు. కొవ్వొత్తులు వెలిగించి ఎస్సీ వర్గీకరణను రద్దుచేసేలా ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని నినాదాలు చేశారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వర్గీకరణను రద్దుచేయకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వాలను కూలదోయడానికి వెనుకాడమన్నారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణపై తప్పుడు విధానాలను అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. నిరసనలో నాయకులు చీకురుమెల్లి కిరణ్‌కుమార్, కాశి వీరవెంకటసత్యనారాయణ, పోతుల సుందరం, వారా లక్ష్మీనరసింహరామ్, జిత్తుక రాంబాబు, బొక్కా రామచంద్రరావు, బీర అన్నవరం, పులపర్తి వెంకటేశ్వరరావు, గుత్రాల రాంబాబు, గూటం సాయి, మాకే సిద్దూ, నాగవరపు శ్రీను, చినవెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆయుష్మాన్ ఆరోగ్యశాఖ సిబ్బంది ధర్నా

అమలాపురం టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఆరేళ్లుగా పనిచేస్తోన్న తమ సమస్యలను ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలన్నారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.సాయిశంకర్, జిల్లా కార్యదర్శి కె.సాయితేజ, బి.శివ, పి.మనోహర్, జల్లి వెంకటేష్, హిమజ, టి.రంగారావు, రాజీవ్, సుమంత్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. పలువురు ఉద్యోగినులు పిల్లా పాపలతో నిరసనలో పాల్గొని ప్లకార్డులను ప్రదర్శించారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అభిషేకాలు

మలికిపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మలికిపురం హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. వారం రోజుల క్రితం అయ్యప్ప స్వామిని ప్రతిష్ఠ చేసిన ఈ ఆలయంలో తొలిసారిగా అభిషేకాలు చేయడంతో పలువురు దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. పలువురు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

అంబాజీపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తోన్న ఉపాధి కూలీలు ఎండలో జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ వాసంశెట్టి రేవతిపెదబాబు సూచించారు. ఉపాధి పనులను సర్పంచ్ పరిశీలించి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరోజని, వైద్య సిబ్బంది, ఉపాధిక్షేత్రసహాయకుడు చిరంజీవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



స్టేట్ యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో న్యాయ నిర్ణేతలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జూన్‌లో అమలాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు జిల్లా నుంచి యోగా శిక్షణ పొందిన వారిని ఎంపిక చేసినట్టు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో అమలాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం యోగా పోటీలు, జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించే వారిని ఎంపిక చేశారు. ఈపోటీలను రోటరీ క్లబ్ అధ్యక్షుడు కూచిమంచి శశిధర్‌శ్రీరామ్ ప్రారంభించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి మెమెంటోలు, పతకాలు అందజేశారు. ఈపోటీలకు న్యాయ నిర్ణేతలుగా గోటేటి గంగాధరరావు, పుత్సా కృష్ణకామేశ్వర్‌లు వ్యవహరించారు. జూన్‌లో రాష్ట్రస్థాయి యోగా పోటీలను ఘనంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

అవయవ లోపం మనసుకు కాదు: ఎమ్మెల్యే



ప్రత్యేక అవసరాల గల పిల్లలకు సైకిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అవయవ లోపం శరీరానికే కాని మనసుకు కాదని, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను అక్కున చేర్చుకుని వారిలో గల ప్రతిభను గుర్తించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల భవిత సెంటర్లకు చెందిన 35మంది పిల్లలకు ట్రైసైకిళ్లు, సీపీ చైర్స్, రోటర్స్, హియరింగ్ హడ్స్‌లను కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పం చ్ బొండాడ నాగమణి, ఎంఈవోలు కె.హెలీనా, ఎం.ప్రకాష్, పి.శ్రీనివాస్, యస్వియస్ లక్ష్మీనా రాయణ, నాయకులు దాసరి వీరవెంకటసత్య నారాయణ, మట్టపర్తి రామకృష్ణ, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, చొల్లంగి సత్యనారాయణమూర్తి, శేరు శ్రీనుబాబు, నక్కా సత్యనారాయణ, యడ్ల ఏసు, గనిశెట్టి ఈశ్వర్, అల్లాడి తేజ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను గుర్తుచేసుకోవడం అభినందనీయం

పి.గన్నవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మహనీయుల సేవలను గుర్తుచేసుకుని, వారి పేరున పురస్కారాలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొనియాడారు. కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పి.గన్నవరం భీమాల వెంకటేశ్వరరావు కాంప్లెక్స్‌లో మమత స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన నీతిపూడి గణపతిరావు సేవా పురస్కారాలు అందించారు. తొలుత మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, ఏపీఎస్పీ ప్రత్యేక దళం కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, నీతిపూడి గణపతిరావు (గణపతిరావు మనవడు)లతో కలిసి 78మందికి మెమెంటో, సర్టిఫికెట్లు అందించి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయ కుడు నల్లా పవన్‌కుమార్, వైసీపీ నియోజక వర్గ కన్వీనర్ గన్నవరపు శ్రీనివాసరావు, జడ్పీ టీసీ బూడిద వరలక్ష్మి, అరిగెల బాలరామ్మూర్తి, భీమాల వెంకటేశ్వరరావు, బీవీవీ సత్యనారాయణ, తోలేటి సుబ్బారావు, నల్లా పెద్దకాపు, కోట రామమోహనరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్ కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు టి.చల్లపల్లి, గోపవరం, సరిపల్లి, ఎస్.యానాం, వాసాలతిప్ప, అల్లవరం మండలంలోని నక్కారామేశ్వరం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



కుట్టుమిషన్ శిక్షణ కేంద్రంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు

కాట్రేనికోన, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. బుధవారం చెయ్యేరులో కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారని, త్వరలోనే మిగిలిన హామీలు నెరవేరుస్తారని అన్నారు. ఎమ్మెల్యేను మహిళలు సన్మానించారు. కార్యక్రమంలో కుట్టుమిషన్ టీచర్ నూకల స్వాతిదుర్గ, కంప్యూటర్ ఆపరేటర్ గుబ్బల ధనలక్ష్మి, కట్టా కనకదుర్గ, కట్టా రత్నకుమారి, బీవీవీ మణికుమారి, వాసంశెట్టి నాగసుందరి, ముడిదుడ్డి శ్రీలక్ష్మి, పాము చంద్రావతి, నాయకులు నడింపల్లి సుబ్బరాజు, సర్పంచ్ చెల్లి సురేష్, నాగిడి నాగేశ్వరరావు, త్సవటపల్లి నాగేంద్ర, త్సవటపల్లి శ్రీను, త్సవటపల్లి బీవీ నారాయణస్వామి, సలాది నానాజీ, నామా వెర్రిబాబు, నంద్యాల వెంకన్నబాబు, ఎంపీటీసీ గుత్తుల మహాలక్ష్మీశ్రీనివాస్, పెయ్యల ముత్యాలరావు, యాళ్ళ శ్రీనివాసరావు(త్రిబుల్ ఆర్), ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, యనమల బాలాజీ, బూల శ్రీను, షేక్ బాదుషా, గిడ్డి చంటిబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన డ్వామా ఏపీడీ

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనకు ఉపాధి సిబ్బంది ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని డ్వామా ఏపీడీ రాంబాబు సిబ్బందికి సూచించారు. బుధవారం విలసవిల్లి పంచాయతీ గోకనవిల్లి, భీమనపల్లి గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. వడగాల్పుల కారణంగా ఉపాధి హామీ గ్రామీణ వికాస కార్మికులు జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి సురక్షబీమాయోజన, జీవనజ్యోతిబీమా పథకాలపై అవగాహన కల్పించారు.ప్లాంటేషన్ మేనేజర్ త్రినాధ్, ఏపీవో వీరబాబు, టీఏ బాలరాజు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో శ్మశానవాటిక అభివృద్ధి

అల్లవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరొందిన బోడసకుర్రులో వైనతేయ నదీపాయ చెంతన రూ.10లక్షల దాతల విరాళంతో శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు చేపట్టారు. దహన సంస్కారాలు నిర్వహించుకునేందుకు నూతనంగా భవనాన్ని నిర్మించారు. అలాగే నూతన భవనాన్ని బుధవారం గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ప్రారంభించారు. కలిగినీడి బేబి, అడపా శ్రీను, అరవ చంటి, చుండూరి శ్రీహరి, రోళ్ల అన్నవరం, మొయిల భీముడు, రోళ్ల శ్రీను, రంకిరెడ్డి వెంకటేశ్వరరావు, సాపే ధర్మరాజు, అప్పన పుల్లయ్య, వాసర్ల చిన్నా, దాతలు పాల్గొన్నారు.

ఆధునిక సాహిత్యానికి బాటలు వేసిన మహాకవి శ్రీశ్రీ

అమలాపురం రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాహిత్యానికి బాటలు వేసిన మహాకవి శ్రీశ్రీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని శ్రీశ్రీకళావేదిక జిల్లాశాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి పేర్కొన్నారు. తెలుగు సాహిత్యాన్ని మరో మలుపు తిప్పిన యుగకర్తగా కీర్తించారు. శ్రీశ్రీకళావేదిక, కోనసీమ రచయితల సంఘం, సాయిసంజీవిని వాకర్స్ యోగా సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతి సభను బుధవారం నడిపూడి డాబా గార్డెన్స్‌లో నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రంలో శ్రీశ్రీరాసిన తెలుగువీర లేవరా గీతానికి జాతీయస్థాయి అవార్డు లభించిందన్నారు. కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు.

చివరి మజిలీలోనూ ఇక్కట్లు

- శ్మశానానికి దారేదీ....
- పంట పొలాల మధ్య నుంచి బురదలో నడుచుకుంటూ వెళ్లాలి



మృతదేహాన్ని బురదలో నుంచి తీసుకువెళ్తున్న దృశ్యం (ఫైల్)

ఐ.పోలవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మనిషి చివరి మజిలీలోను కష్టాలు తప్పడంలేదు. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు పైబడినా నేటికి ఆ గ్రామానికి శ్మశానవాటికకు వెళ్లేందుకు రహదారి లేదు. తరాలు మారుతున్నా తమకు మాత్రం చివరి మజిలీలో ఇక్కట్లు తప్పడంలేదని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. జి.మూలపొలం పంచాయతీ బీమ్‌నగర్ వాసుల ఆవేదన ఇది. ఇక్కడ శ్మశానికి వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో పంట పొలాల మధ్య నుంచి బురదలో నడుచుకుంటూ శవయాత్ర చేయవలసి వస్తోంది. ఏళ్ల తరబడి ఈ సమస్యను పరిష్కరించండంటూ ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకుంటున్నప్పటికీ పరిష్కారం మాత్రం లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రామంలో ఒక వ్యక్తి అకాల మరణం చెందాడు. శ్మశానికి వెళ్లేందుకు దారిలేక ఇబ్బందులు పడ్డామని మృతుడి సంబంధీకులు ఆవేదన వ్యక్తం చేశారు. 2000మంది జనాభా ఉన్న ఎస్సీ గ్రామానికి నేటికీ శ్మశాన మార్గం సమస్య తీరలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ జిల్లా కమిటీ ఏర్పాటు



కాంగ్రెస్ నూతన కమిటీ సభ్యులతో కొండేటి చిట్టిబాబు

మామిడికుదురు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 16మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసినట్టు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అనుమతితో ఏడుగురు జిల్లా ఉపాధ్యక్షులు, ఎనిమిది జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఒక జిల్లా కార్యదర్శిని ప్రకటించానన్నారు. నూతన కమిటీ సభ్యులు జిల్లాలో పార్టీని పటిష్ట పరిచి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అయితాబత్తుల సుభాషిణి, సరెళ్ల ప్రసన్నకుమార్, అప్పన శ్రీరామకృష్ణ, చిట్టూరి సత్యనారాయణచౌదరి పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుకలు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జనుపల్లిలో బుధవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ అందరివాడని, అందరి జీవితాల్లో వెలుగులు నింపేలా రాజ్యాంగ రచన సాగించారని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, దున్నాల దుర్గ, వాకపల్లి స్వామినాయుడు, ఈతకోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కిమ్స్‌లో వెంకన్న దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 2నుంచి 4వరకు నిర్వహిస్తున్నట్టు చైతన్య విద్యా సంస్థల అధినేత కలిదిండి వీరవెంకటసత్యనారాయణరాజు (చైతన్యరాజు)-బదరీలక్ష్మీలు తెలిపారు. ఖండవిల్లి సూర్యనారాయణాచార్యులు, బి.కేశవరామాచార్యుల ఆచార్య బ్రహ్మత్వంలో త్రయాహ్నిక దీక్షగా బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తొలిరోజు బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ ముఖ్యవక్తగా హాజరై ఆధ్యాత్మికోపన్యాసం చేస్తారు. 5న లక్ష్మీహోమం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం స్వామివారి దివ్య కల్యాణం జరుగుతుంది. 4న సుదర్శన హోమం, పూర్ణాహుతి, స్వామివారి చక్రస్నానం, అనంతరం గ్రామోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని చైతన్యరాజు తెలిపారు. కార్యక్రమంలో కలిదిండి రవివర్మ-శేషపవిత్ర, కలిదిండి శశివర్మ-వెంకటలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా కమిటీ ప్రతినిధులకు నియామక ఉత్తర్వులు

అమలాపురం టౌన్, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిలా శాఖ ప్రతినిధులను జిల్లాశాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు బుధవారం ప్రకటించి నియామక ఉత్తర్వులను అందజేశారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నిమ్మకాయల నాగేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా వస్కా బాబు, సుగ్గు ప్రసాద్‌లను నియమించినట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి తెలిపారు. మండల స్థాయి నుంచి పార్టీని బలోపేతంచేసి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని బాధ్యతలు స్వీకరించిన నాయకులు ప్రకటించారు. దామిశెట్టి జయ, పోలిశెట్టి హరిబాబు, దోనిపాటి విజయలక్ష్మి, జోగి అర్జునరావు, షకీలా, పేరి శర్మ, పులుసుగంటి ప్రకాష్, ఈతకోట సోమరాజు, ఏలేశ్వరం రాధాకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అంతర్వేది, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు 11కేవీ లైన్‌లో ట్రీ కటింగ్ కారణంగా సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు సఖినేటిపల్లి ఏఈ బి.ప్రసాద్ తెలిపారు. రాజోలు, పి.గన్నవరం, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు సరఫరా ఉండదన్నారు

సమగ్ర శిక్ష కార్యాలయానికి బీరువా బహూకరణ

ముమ్మిడివరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష కార్యాలయానికి పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరాల కృష్ణకుమార్, దీపాటి సురేష్‌బాబులు రూ.12వేలు విలువైన బీరువాను బహూకరించారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా ఆధ్వర్యంలో అకడమిక్ మోనిటరింగ్ అధికారి పి.రాంబాబుకు బుధవారం బీరువాను అందించారు. అనంతరం పది పరీక్షా ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినందుకు డీఈవో సలీంబాషాను పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్ నాయకులు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సీఎంవో బీవీ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు ఎం.అమృతరావు, పాలూరి గోపాలకృష్ణ, కడియాల గోవిందరాజులు, ఓదూరి వెంకటరమణ, యాళ్ల పల్లంరాజు, డీవీవీ శ్రీనివాస్, మేడిశెట్టి సత్యనారాయణ, డీవీఆర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి



పహల్గాం మృతులకు సంతాపం తెలుపుతున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతులకు నివాళులర్పిస్తూ అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్‌లో మృతులకు ఘనంగా నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఉగ్రవాదంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, అధ్యక్షురాలు ఎం.కమలసాయి, జల్లి సుజాత, వివిధ క్లబ్‌ల ప్రతినిధులు బీవీవీ సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి, గోకరకొండ నాగేంద్ర, తేతల సత్యనారాయణరెడ్డి, గోటేటి గంగాధర్, గోటేటి లక్ష్మి, యర్రమిల్లి అనంతలక్ష్మి, విజయలక్ష్మి, డాక్టర్ పీఎస్ శర్మ, బూరగాయల శివరామకృష్ణ, పట్నాల రమణ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా

అల్లవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడసకుర్రులో పైపులైను మరమ్మతుల్లో భాగంగా గ్రామంలోని వివిధ ప్రదేశాలకు ట్యాంకరు ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్టు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, కార్యదర్శి బి.ఆదిశంకరం తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సింహాచలంలో దైవదర్శనానికి వెళ్లి గోడకూలిన ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు జనసేన తరపున అండగా ఉంటామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. కొర్లపాటివారిపాలెంలో స్వామినాయుడు, మణికంఠ కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి ఓదార్చారు. గ్రామంలో ఒకేసారి ఇద్దరు యువకులు మృతిచెందడం దురదృష్టకరమన్నారు. జనసేన సభ్యత్వాలు కలిగిన ఇద్దరి యువకుల కుటుంబసభ్యులకు న్యాయం చేసేలా పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లానన్నారు. నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, గణపతి వీరరాఘవులు, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, సుంకర బాలాజీ, అరిగెల సూరిబాబు, నాగాబత్తుల సుబ్బారావు, తాటికాయల శ్రీను, అరిగెల బుజ్జి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వీడ్కోలు సన్మాన సభ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో క్రైమ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సీహెచ్ వెంకటరమణ ఉద్యోగ విరమణ వీడ్కోలు సన్మాన సభ బుధవారం ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు కార్యాలయంలో నిర్వహించారు. వెంకటరమణ దంపతులకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. 42ఏళ్ల పాటు పోలీసుశాఖలో విలువైన సేవలు అందించి జూనియర్లకు స్ఫూర్తిదాయకంగా వెంకటరమణ నిలిచారని స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ బి.రాజశేఖర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్‌లు కొనియాడారు. పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో చేసిన సేవలతోనే గుర్తింపు



అమలాపురం టౌన్/మామిడికు దురు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగి విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ప్రజలతో పాటు అధికారుల్లోను మంచి గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం మామిడికుదురు మండల తహశీల్దార్ ఎదురువాడ వెంకటసుబ్రహ్మణ్యాచారి దంపతులకు కలెక్టర్ ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పరిపాలనలో కీలకమైన రెవెన్యూ విభాగంలో అమూల్య సేవలు అందించిన ఘనత సుబ్రహ్మణ్యాచారికి దక్కుతుందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి, పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావులు కలెక్టర్‌తో కలిసి సుబ్రహ్మణ్యాచారి దంపతులను సత్కరించారు.

పార్టీని బలోపేతం చేయాలి

రాజోలు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి వైసీపీని బలోపేతం చేసేవిధంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని వైసీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పిలుపునిచ్చారు. రాజోలులో ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీశ్వరి స్వగృహం వద్ద గ్రామశాఖ అధ్యక్షుడు అడబాల జానకీరామారావు అధ్యక్షతన జరిగిన వైసీపీ గ్రామశాఖ సమావేశానికి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవు జ్యోతి, తెన్నేటి కిశోర్, దార్ల పెదబాబు, ఉచ్చుల దాసు, మొల్లేటి నాగరాజు, నల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేసవి శిక్షణా శిబిరం

రాజోలు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుంచి జూన్ 1 వరకు రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్చరీ (విలువిద్య) వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తామని ఆర్చరీ లెవెల్-1 కోచ్ జొన్నలగడ్డ గోపాలకృష్ణ తెలిపారు. మే 1వ తేదీ ఉదయం 10గంటలకు సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతీరోజు ఉదయం 6 నుంచి 8గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు.

భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా

రాజోలు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వాహన యజమానులకు రూ.1.10లక్షలు జరిమానా విధించామని రావులపాలెం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ ఆర్.షణ్ముక్‌శ్రీనివాస్ బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి 7 నుంచి 11 గంటల వరకు చాకలిపాలెం, తాటిపాక పరిసరాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన 40వాహన యజమానులకు చలానా రూపంలో రూ.1.10లక్షలు జరిమానా విధించామన్నారు.

శతాధిక వృద్ధుడు సాహెబ్ మృతి

ముమ్మిడివరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కొత్తలంక గ్రామ పంచాయతీ పరిధిలోని రమాబాయి పేటకు చెందిన శతాధిక వృద్ధుడు దాసరి సాహెబ్ బుధవారం ఆయన స్వగృహంలో మృతిచెందారు. ఆయనకు ఒక కుమారుడు, కోడలు, ముగ్గురు మనుమలు, ఒక మనుమరాలు ఉన్నారు. దివంగత సాహెబ్ రమాబాయిపేట గ్రామపెద్దగా సుదీర్ఘకాలం వ్యవహరించారు.

వైభవంగా పరశురాముడి జయంతి

పి.గన్నవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పరశురాముడి జయంతిని పురస్క రించుకుని ముంగండ గ్రామంలో చింతామణి గణపతి బ్రాహ్మణ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పరశురామ చిత్రపటాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై డప్పులతో ఊరే గించారు. అనంతరం సీనియర్ బీజేపీ నాయకులు చెరుకూరి గోపాలకృష్ణ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముక్కామల సూర్యనారాయణమూర్తి, ఉపద్రష్ట రవి, ముక్కామల గణేష్, చెరుకూరి వెంకటఅప్పారావు, ఎస్.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి

అయినవిల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. బుధవారం సిరిపల్లి గ్రామం ఇందిరా కాలనీలో జరిగిన అంబేడ్కర్ జయంత్యుత్సవంలో ఆయన పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శిలా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కూటమి నాయకులు, జై భీమ్ యూత్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మండపేట

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రాయవరం పీహెచ్‌సీలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మలేరియా జిల్లా అధికారి

రాయవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా జిల్లా అధికారి నక్కా వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం రాయవరం, మాచవరం పీహెచ్‌సీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు చలి, జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీల్లో ల్యాబ్‌లు, రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మాచవరం పీహెచ్‌సీలో డెంగీ, మలేరియా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన వెంట వైద్యులు రమ్యశ్రీ, డాక్టర్ మణికంఠ, ఏరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కేవీవీ సత్యనారాయణ, వైద్య ఆరోగ్య సిబ్బంది నాగరాజు, జె.శంకర్, టి.ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.78 లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తదనంతరం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,78,510 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ గరగల గ్రామోత్సవం



పోలేరమ్మ గరగలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వెదురుపాక గ్రామస్తుల ఇలవేల్పు పోలేరమ్మ జాతరను పురస్కరించుకుని అమ్మవారి గరగల గ్రామోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమ్మవారి ఆలయం వద్ద పోలేరమ్మకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. ప్రతి సంవత్సరం వైశాఖమాసం పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. బుధవారం అమ్మవారి ప్రతి రూపాలైన గరగలను గ్రామంలోకి తీసుకువచ్చి తీర్థం రోజున తిరిగి మళ్లీ గర్భగుడిలో ఉంచుతారు. మే 12న అమ్మవారి జాతర, 13న తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి గరగలకు గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు పసుపు, కుంకుమ, నైవేద్యం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.

లో ఓల్టేజీ సమస్య లేకుండా చర్యలు

ద్రాక్షారామ, ఏప్రిల్, 30(ఆంధ్రజ్యోతి): వెల్ల గ్రామంలో నిర్మించే 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రాష్ట్రకార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ వెల్లలో నిర్మించే విద్యుత్ సబ్‌స్టేషన్ వల్ల ద్రాక్షారామ సబ్‌స్టేషన్‌పై లోడ్ తగ్గుతుందన్నారు. వెల్ల, వెల్లసావరం, యేరుపల్లి, హసన్‌బాద, కన్నడతోట, ఉండూరు, బీకేపాలెం, ద్రాక్షారామ, ఆదివారపుపేట గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరాకు వీలు కలుగుతుందన్నారు. వెల్లలో నిర్మించే విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు వేగవంతంగా చేయాలని ఆయన కోరారు. సోలార్ విధానంలో విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవటంతోపాటు రాయితీని కూడా పొందాలని ప్రజలను ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ వై. విజయనంద్, ఈఈ కే.రత్నాకరరావు, డీఈఈ కే.మురళీమోహన్, ఏఈ వి.రమణారావు, రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ తదితరులతో పాటు పలువురు అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.



వెల్లలో సబ్‌స్టేషన్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సుభాష్

అర్హులందరికీ పెన్షన్ మంజూరు చేయాలి

మండపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) పెన్షన్ పంపిణీలో పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూళి జయరాజు అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌కు అర్హులెవరైతే వున్నారో వారందరికి పించన్‌లను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే అర్హులందరికి పించన్ మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలన్నారు.

వైద్య ఆరోగ్య సిబ్బందికి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ సునీల్

కె.గంగవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వైద్య ఆరోగ్య సిబ్బందికి పలు అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యువన్ ఓవర్ డ్యూస్‌పై ఓరియంటేషన్ ట్రైనింగ్ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలోని ఇమ్యునైజేషన్ సెక్షన్ నుంచి వచ్చిన ఎంపీహెచ్ఎస్ బోసు, వ్యాక్సిన్ మేనేజర్ సునీల్ పాల్గొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్‌లకు, ఏఎన్ఎంలకు యువన్ ఓవర్ డ్యూస్‌పై రీ ఓరియంటేషన్ శిక్షణ జరిపారు. కార్యక్రమంలో మండలంలోని పామర్రు, దంగేరు, పేకేరు, కుందూరు ఆసుపత్రుల హెల్త్ సూపర్‌వైజర్‌లు గుడాల శ్రీమన్నారాయణ, పద్మేష్ బాబు, పి.మూర్తి, ప్రసన్నకుమారి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ వద్ద నేడు చలివేంద్రం ఏర్పాటు

మండపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి గ్రామానికి చెందిన సుంకర వెంకటరమణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మే డేను పురస్కరించుకుని ఆర్‌టీసీ బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని ట్రస్టీ సుంకర నాని తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం శాశ్వతంగా ఉండేలా ఇక్కడ చల్లటి మంచినీరు అందించనున్నామని తెలిపారు. ద్వారపూడి బట్టల మార్కెట్‌లో పనిచేసే జట్టు కార్మికులు మేడే ఉత్సవాన్ని పురస్కరించుకుని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ట్రస్టు ద్వారా విద్యార్థులకు పుస్తకాల పంపిణీతోపాటు పేదలకు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. సుంకర ట్రస్టు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆయుష్మాన్ ఆరోగ్యశాఖ సిబ్బంది ధర్నా

అమలాపురం టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఆరేళ్లుగా పనిచేస్తోన్న తమ సమస్యలను ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలన్నారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.సాయిశంకర్, జిల్లా కార్యదర్శి కె.సాయితేజ, బి.శివ, పి.మనోహర్, జల్లి వెంకటేష్, హిమజ, టి.రంగారావు, రాజీవ్, సుమంత్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. పలువురు ఉద్యోగినులు పిల్లా పాపలతో నిరసనలో పాల్గొని ప్లకార్డులను ప్రదర్శించారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మేడే ముందస్తు వేడుకల్లో మంత్రి సుభాష్

ద్రాక్షారామ (రామచంద్రపురం) ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పారు. రామచంద్రపురంలో బుధవారం ముందస్తు మేడే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కార్మికుల దుస్తులు వేసుకుని ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నియోజకవర్గంలో మూడు సంచార వైద్య సేవల కోసం బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. తక్షణ వైద్య సేవలతో పాటు, హృదయ సంబంధ వ్యాధులతో బాధపడే వారికి మెరుగైన వైద్యం అందించేందుకు కాకినాడ, రాజమహేంద్రవరంలకు రోగులను తరలించేందుకు రెండు బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం బస్సును ఏర్పాటు చేస్తామన్నారు. తోటపేట గ్రామానికి చెందిన కోటిపల్లి ప్రేమావతికి రూ.15వేలు, గుబ్బల కామేశ్వరరావుకు రూ.10వేలు ఆర్థికసాయం చేశారు.

నేడు కంటి వైద్య శిబిరం

రాయవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాయవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వాలంటరీ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెలగల ఫణికృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని శ్రీభక్తాంజనేయ భవన నిర్మాణ సంఘం కార్మికులు ప్రారంభిస్తారని తెలిపారు. వైద్య శిబిరంలో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్య బృందం రోగులకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. రాయవరం పరిసర ప్రాంతాల ప్రజలు కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ప్రత్యేక అలంకరణలో ఉన్న అయ్యప్పస్వామి

ఘనంగా అయ్యప్పస్వామి వార్షికోత్సవం

ఆత్రేయపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ర్యాలి గ్రామంలో నున్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రఘు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, సాయం కాలం భజన, రాత్రి పవళింపు సేవలు కన్నుల పండుగగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కంటి వైద్య శిబిరం ప్రారంభం

కొత్తపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కొత్తపేటలో సందీప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బుధవారం ప్రారంభించారు. దివంగత సందీప్ జయంతిని పురస్కరించుకుని తండ్రి బండారు చిట్టిబాబు ఆధ్వర్యంలో సందీప్ ట్రస్టు పేరున వాడపాలెం, కొత్తపేటలో పేదల కోసం ఉచిత క్లినిక్‌లు నడుపుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా చిట్టిబాబును అభినందించారు. పేదలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, ధర్నాల రామకృష్ణ, త్సామా బాబు, చీకట్ల అబ్బు, బూసి భాస్కరరావు, దేవపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న శేషవేణి

డాక్టరేట్ రావడంపై హర్షం

రాయవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాయవరం వీఎస్ఆర్ రూరల్ డిగ్రీ కళాశాల ఛైర్మన్ మల్లిడి శేషవేణికి డాక్టరేట్ లభించినట్లు బుధవారం విలేకరులకు తెలిపారు. రాయవరంలో శేషవేణి మాట్లాడుతూ ఇటీవల విశాఖలో అమెరికన్ మెరిట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వరల్డ్ చారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ తనకు డాక్టరేట్ అందజేసినట్లు చెప్పారు. ఆమెను డాక్టర్ మల్లిడి ఆదిరెడ్డి, విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు అభినందించారు.

మాజీ సర్పంచ్ వెంకన్న విగ్రహావిష్కరణ

ఆత్రేయపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నార్కెడిమిల్లి మాజీ సర్పంచ్ దివంగత మద్దింశెట్టి వెంకన్న విగ్రహావిష్కరణ సభ బుధవారం నిర్వహించారు. గ్రామాభివృద్ధికి కృషి చేసిన దివంగత వెంకన్న విగ్రహాన్ని ఎస్సీ పేటలోని ఆయన అభిమానులు, టీడీపీ శ్రేణులు నిర్మించారు. మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ కె. నరసింహారావు చేతులు మీదుగా విగ్రహావిష్కరణ నిర్వహించారు.

ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా

అల్లవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడసకుర్రులో పైపులైను మరమ్మతుల్లో భాగంగా గ్రామంలోని వివిధ ప్రదేశాలకు ట్యాంకరు ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్టు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, కార్యదర్శి బి.ఆదిశంకరం తెలిపారు. ఆయా ప్రాంతవాసులు మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం అండ

కలెక్టర్ మహేష్‌కుమార్

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అంగర శ్రీ గణపతి చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి రూ.2 కోట్ల టర్నోవర్‌తో ఈ సంఘం నిలవడం అభినందనీయమన్నారు. చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. చేనేత సహకార సంఘాలను ప్రభుత్వ పరంగా రాయితీలతో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక ప్రపంచంతో పోటీపడుతూ చేనేత కార్మికులు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. చీరలు, వాటిని నేసే నైపుణ్యం, వారసత్వ సంపద దేశానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి పెద్దిరాజు, తహశీల్దార్ చిన్నారావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, సొసైటీ ఇన్‌చార్జ్ కె.గంగరాజు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, జి.రాజు, మండలస్థాయి అధికారులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



అంగరలో మగ్గంపై చేనేత తయారీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

రైతుబజారులో నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి

ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండపేట గాంధీనగర్‌లో వున్న రైతుబజార్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. వ్యాపారులు విక్రయిస్తున్న కూరగాయల నాణ్యతతోపాటు ధరల వివరాలను ఆయన తెలుసుకున్నారు. వినియోగదారులకు బోర్డుపై వున్న ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యాపారులను ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక టీడీపీ నేతలతో పాటు రైతుబజార్ ఎస్టేట్ అధికారి వున్నారు. రైతుబజారులో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ పాడై వ్యాపారులు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సైఫాన్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన

ఆత్రేయపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం ఆత్రేయపురం మండలం లొల్ల వద్ద నిర్మించనున్న సైఫాన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లొల్ల, మెర్లపాలెం, వాడపల్లి గ్రామాల రైతుల పంటపొలాలు ముంపుబారిన పడకుండా సైఫాన్ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. రైతు సంక్షేమానికి అహర్నిశలు పాటుపడతానన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహారావు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, మాజీ సమితి అధ్యక్షుడు మద్దూరి సుబ్బారావు, డ్రైనేజీ శాఖ ఏఈ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల సాకారం: ప్రతి ఏటా రైతుల పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఆత్రేయపురం, లొల్ల, వాడపల్లి, మెర్లపాలెం, ఊబలంక గ్రామాల రైతుల పంట పొలాలు మూడు దశాబ్ధాలుగా ముంపునకు గురవుతున్నాయి. అధిక వర్షాలు, శివారు ప్రాంతాలకు సాగునీరు, పంపిణీ చేస్తున్న సమయంలో వందల ఎకరాలు పంట భూములు ముంపునకు గురై నష్టాలబారిన పడు తున్నారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సైఫాన్ నిర్మిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయడు సహకారంతో నిధులు మంజూరు చేయించి రైతుల కల నెరవేర్చనున్నారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేను అభినందించారు.



లొల్ల వద్ద నిర్మిస్తున్న సైఫాన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు

రాజధాని నిర్మాణంతో భావితరాలకు మేలు

టీడీపీ జిల్లా అధ్యక్షురాలు అనంతకుమారి



కొత్తపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణంతో భావితరాలకు బంగారు భవిష్యత్ ఏర్పడిందని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి పేర్కొన్నారు. బుధవారం కొత్తపేటలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విధ్వంసానికి గురైన అమరావతిని తిరిగి కూటమి ప్రభుత్వం రావడంతో అభివృద్ధి పట్టాలెక్కిందన్నారు. రాజధాని అమరావతి ప్రపంచంలోనే తొలిసోలార్ నగరంగా చరిత్ర సృష్టిస్తుందని తెలిపారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎంతో మెరుగవుతాయన్నారు. రైతుల ప్రాణత్యాగాలు, పోరాటాలు, న్యాయస్థానాల జోక్యంతో అమరావతి చెక్కు చెదరకుండా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిని ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేస్తారని ఆమె తెలిపారు.



వెదురుమూడిలో చెరువు పూడికతీత పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ళ

చెరువు పూడికతీత పనుల ప్రారంభం

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వెదురుమూడిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా చెరువు పూడికతీత పనులను బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రారంభించారు. అమృత సరోవర్ పథకంలో పశువుల చెరువు పూడికతీత పనులకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం నూతనంగా అభివృద్ధిపరిచిన ఆర్అండ్‌బీ రహదారిని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ కూలీలను గ్రామీణ వికాస శ్రామికులుగా నామకరణం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పుత్సల శ్రీనివాస్, చుండ్రు అచ్యుతరామారావు, బోనం నానిబాబు, ఇళ్ళ రాంబాబు, అనుసూరి బూరయ్య, బాపిరాజు, సత్తిబాబు, వెంకట్రావు, కార్యదర్శి శారద, జేఈ సింగ్, ఫీల్డ్ అసిస్టెంట్ బోనం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

ఆత్రేయపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండల విద్యాశాఖాధికారి-2 మత్సా సాహెబ్ ఉద్యోగ విరమణ సత్కార సభ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సత్కరించారు. ఉపాధ్యాయుడిగా ఆయన 39 ఏళ్లపాటు సేవలను పలువురు కొనియాడారు. ఎంఈవో పి.వరప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఎంఈవో దంపతులను సత్కరించారు.



మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవోను సత్కరిస్తున్న దృశ్యం

కనకదుర్గమ్మ ఆలయానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

మండపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండపేటలోని 27వ వార్డులో నూతనంగా నిర్మించే కనకదుర్గమ్మ ఆలయానికి బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు భూమిపూజ, శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, లంకలపల్లి రాంబాబు, ఎండీ ఖరీం, పి.విజయ్, కృష్ణమూర్తి, విష్ణు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

పహల్గాం మృతులకు నివాళి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతులకు నివాళులర్పిస్తూ అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్‌లో మృతులకు ఘనంగా నివాళులర్పించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, అధ్యక్షురాలు ఎం.కమలసాయి, జల్లి సుజాత, వివిధ క్లబ్‌ల ప్రతినిధులు బీవీవీ సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి, గోకరకొండ నాగేంద్ర, తేతల సత్యనారాయణరెడ్డి, గోటేటి గంగాధర్, గోటేటి లక్ష్మి, యర్రమిల్లి అనంతలక్ష్మి, విజయలక్ష్మి, డాక్టర్ పీఎస్ శర్మ, బూరగాయల శివరామకృష్ణ, పట్నాల రమణ తదితరులు పాల్గొన్నారు.



పహల్గాం మృతులకు సంతాపం తెలుపుతున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకాలు

ఆలమూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): చింతలూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రధానార్చకుడు పెదపూడి సత్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో పండితులు కుంకుమ, హరిద్ర, చందనంలతో అభిషేకాలు చేశారు. మహిళా భక్తి మండలి సభ్యులతో విష్ణు సహస్రనామ పారాయణాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు నరసింహస్వామి అభిషేకాలను తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు ద్విభాష్యం కాశీవిశ్వనాధశర్మ, అల్లంరాజు రామకృష్ణమూర్తి, అల్లంరాజు భరణి తదితరులు ఆయా ఏర్పాట్లు చేశారు.

డిప్యూటీ సీఎం పవన్ వ్యాఖ్యలు దురదృష్టకరం

కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన

మండపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఖండించారు. మండపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. జమ్మూ కశ్మీర్‌లో ఇటీవల ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో 23న జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పాల్గొన్న సమావేశంలో తమకు దేశమే ముఖ్యమని మతాలు కులాలు కాదని చెప్పారన్నారు. భారత్ తీసుకునే చర్యలకు తమ మద్దతు ఉంటుందని వారు ప్రకటించిన విషయాన్ని కామన గుర్తుచేశారు. డిప్యూటీ సీఎం తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

షర్మిలను గృహనిర్బంధం చేయడం దారుణం: అమరావతి పర్యటనకు బయలుదేరిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు గృహనిర్బంధం చేయడాన్ని కామన ఖండించారు. ఆమెను అడ్డుకోవడం అప్రజాస్వామికమని ఆయన అన్నారు.



మృతుడి భార్యకి నగదు అందిస్తున్న కోనసీమ టెంట్‌హౌస్ అసోసియేషన్ సభ్యులు

బాధిత కుటుంబానికి సాయం

రావులపాలెం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా టెంట్‌హౌస్ అసోసియేషన్ సభ్యుడు గంటి శ్రీను ఇటీవల గుండెపోటుతో మరణించాడు. దీంతో అసోసియేషన్ అధ్యక్షుడు వెలగల కాశీరెడ్డి ఆధ్వర్యంలో కొవ్వూరి గంగిరెడ్డి, నాని, శ్రీనివాసరెడ్డి రూ.1.17 లక్షలు ఆర్థికసాయాన్ని మృతుడు భార్యకు అందజేశారు.

సింహాచలం ఘటన దురదృష్టకరం

మండపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సింహాచలంలో బుధవారం గోడకూలీ ఏడుగురు మృతి చెందిన సంఘటన బాధాకరమని అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ అన్నారు. ఈ సంఘటనపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం వెనక అధికారుల వైఫల్యం కనిపిస్తోందన్నారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.